PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 39 | విజయవాడ, శుక్రవారం 8 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Friday 8 September 2023 | Rs

సర్వం సిద్ధం
- రేపటి నుంచి జి20 శిఖరాగ్ర సమావేశాలు
- ఢిల్లీలో 'లాక్‌డౌన్' తరహా ఆంక్షలు
- రాజధాని సరిహద్దులు మూసివేత
- నేటి నుంచే అగ్రనేతల రాక మొదలు

● లోపలి పేజీలో.. ●

ఫైనల్‌కు బొప్పన్న జోడి
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల డబుల్స్ ఫైనల్లోకి రోహన్ బొప్పన్న జోడీ ప్రవేశించింది. గురువారం జరిగిన తొలి సెమీస్‌లో 6వ సీడ్ బొప్పన్న, ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్ జోడీ 7-6(7-3), 6-2తో అన్‌సీడెడ్ ఫ్రాన్స్‌కు చెందిన మహత్-హెబర్ట్ జోడీని చిత్తుచేసింది. దీంతో 2010 తర్వాత బొప్పన్న గ్రాండ్‌స్లామ్ డబుల్స్ కెరీర్‌లో రెండోసారి మాత్రమే ఫైనల్‌కు చేరాడు. రెండో సెమీస్ 3వ సీడ్ సాలిస్‌బరీ-ఆర్ రామ్, 2వ సీడ్ డోడిగ్-క్రాజిసెక్‌ల మ్యాచ్ విజేతతో ఫైనల్లో టైటిల్‌కై తలపడనున్నారు.

వృద్ధి ఉత్తదేనా...?

ఆర్థిక నిపుణుల అనుమానాలు



న్యూఢిల్లీ : ఆర్థిక వృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతున్న లెక్కల్లో వాస్తవం లేదా? ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు ఆయన మంత్రివర్గ సహచరులు, బిజెపి నాయకులు ఊదరగొడుతున్న 7.8 శాతం జిడిపి వృద్ధికి వాస్తవానికి పొంతన లేదా? పలువురు ఆర్థిక రంగ నిపుణులు వ్యక్తం చేస్తున్న అనుమానాలవి! ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించామంటూ మోడీ పరివారం చేసుకుంటున్న ప్రచారానికి దేశంలో నెలకొన్న క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేకపోవడమే దీనికి కారణం. నిజవేతనాలు తగ్గుతూనే ఉండటం, ధరల సంక్షోభం కొనసాగుతుండటం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకీ కుదించుకుపోతుండటం, అసమానతలు పెరుగుతుండటం వంటి అంశాలను నిపుణులు కొంతకాలంగా ప్రస్తావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్నట్లుగా వృద్ధి గణనీయంగా ఉంటే క్షేత్రస్థాయిలో ఇటువంటి పరిస్థితులు ఉండవన్న అభిప్రాయం వీరిలో వ్యక్తమవుతోంది. దీంతోపాటు జిడిపి గణన కోసం అంతర్జాతీయంగా పలు దేశాలు అనుసరిస్తున్న పద్ధతికి, భారతదేశం అనుసరిస్తున్న పద్ధతికి గణనీయమైన తేడా ఉన్న విషయాన్ని కూడా వీరు ప్రస్తావిస్తున్నారు. అమెరికా బ్యూరో ఆఫ్ ఎనామిక్ అనాలిసిస్ అనుసరించే పద్ధతిలో లెక్కిస్తే కేంద్ర ప్రభుత్వం చెబుతున్న 7.8 శాతం నుండి 4.5శాతానికి మన జిడిపి పడిపోతుందని తాజా నిర్ధారణ. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయం 'ప్రిన్స్‌టన్'లో అంతర్జాతీయ ఆర్థిక విధానాల విజిటింగ్ ప్రొఫెసర్ అశోక్ మోడీ ఈ నిర్ధారణ చేశారు. ఈయన గతంలో ప్రపంచబ్యాంకు ఐఎంఎఫ్ విభాగంలో పనిచేసి ఉండటం గమనార్హం. ఈ నిర్ధారణ ప్రకారం 2022 ఏప్రిల్-జూన్‌లో కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన 13.1శాతం జిడిపి నుండి 4.5 శాతానికి భారీస్థాయిలో జిడిపి పడిపోయిందని చెప్పవచ్చు. అశోక్‌మోడీతో పాటు పలువురు ఆర్థిక వేత్తలు ఇదే రకమైన విశ్లేషణలు చేస్తున్నందునే కేంద్ర ప్రభుత్వం చెబుతున్న పురోగతి లెక్కలను ఇతర దేశాలు అంత తీవ్రంగా పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారతదేశ అధికారిక గణాంకాలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయన్న అభిప్రాయాన్ని అశోక్ మోడీ వ్యక్తం చేస్తున్నారు. కచ్చితమైన లెక్కలు రావాలంటే ఆదాయ, వ్యయాలను రెండింటిని పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని, భారత ప్రభుత్వం అలా చేయడం లేదని ఆయన చెప్పారు. ఈ మేరకు 'ప్రాజెక్ట్ సిండికేట్' అనే అంతర్జాతీయ మీడియా సంస్థకు ఆయన రాసిన వ్యాసం తాజాగా ప్రచురితమైంది. 'ఇండియాస్ ఫేక్ గ్రోత్ స్టోరీ' పేరిట ప్రచురితమైన ఈ వ్యాసంలో 'జి-20 సదస్సు నిర్వహణ కోసం పేదల ఇళ్లు, దుకాణాలను కూల్చివేసి ఢిల్లీ నగరాన్ని ముస్తాబు చేస్తున్న విధంగానే జిడిపి లెక్కలను కూడా బ్రాండింగ్.. బ్యూటిఫికేషన్' చేశారని ఆయన వ్యాఖ్యానించారు.

భారీగా పెరిగిన వ్యత్యాసాలు

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ జిడిపికి ప్రామాణికంగా తీసుకుంటున్న ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసాలు గణనీయంగా పెరుగుతున్న విషయాన్ని ప్రస్తావించారు. -3.4శాతం నుండి 2.8 శాతానికి తాజా గణాంకాల్లో వ్యత్యాసాలు పెరిగిన విషయాన్ని ప్రస్తావించారు. దీని ప్రకారం 6.2శాతం వ్యత్యాసాలు పెరిగాయని కొంత కాలంలోనే ఈ స్థాయిలో ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసం ఎలా పెరుగుతుందని ఆయన ప్రశ్నించారు. జిడిపిలోని వ్యయ భాగాలను విశ్లేషిస్తే ప్రైవేటు వ్యక్తులు చేసే వ్యయం, ప్రభుత్వ వ్యయం, విలువైన వస్తువుల కొనుగోలు కోసం చేసే ఖర్చులు గణనీయంగా తగ్గినట్లు కనిపిస్తుందని ఆయన తెలిపారు. ఎగుమతులు తగ్గగా,

మిగతా 2లో

బిజెపి రాజ్యాంగాన్ని అంగీకరిస్తుందా?
- సనాతన ధర్మంపై ఎంఎ బేబి సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: సనాతనధర్మాన్ని ఎవరూ ప్రశ్నించడానికి వీలు లేదన్నట్టు మాట్లాడుతున్న బిజెపి భారత రాజ్యాంగాన్ని అంగీకరిస్తుందా? అని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ సూటిగా ప్రశ్నించారు. ఆయన గురువారం నాడు తన ఫేస్‌బుక్‌లో ఈ మేరకు ఒక పోస్ట్ పెట్టారు. మన రాజ్యాంగం మానవ సమానత్వమే మన రాజ్యాంగానికి ఆలంబన అని ఆయన అన్నారు. ద్రవిడ ఉద్యమం ప్రకారం సనాతన ధర్మాన్ని విమర్శించిన ఉదయనిధి స్టాలిన్‌కు 'వాస్తవాలతో సరైన సమాధానం' చెప్పాలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నట్లు వచ్చిన వార్తలపై బేబీ స్పందించారు.

సనాతనధర్మంలో భాగమైన వర్ణధర్మానికి, అదే చాతుర్వర్ణ వ్యవస్థకు బిజెపి మద్దతిస్తుందా అని ఆయన నిలదీశారు. మానవులు వివిధ వర్ణాలలో (కులాలలో) జన్మించి, తమ తమ కులాలకు కేటాయించిన విధులను మాత్రమే నిర్వర్తించాలని మీరు కోరుకుంటున్నారా? అమానుషమైన కులతత్వం నేటికీ కొనసాగాల నుకుంటున్నారా? సనాతన ధర్మం పేరుతో నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి (మహిళలు చదువుకోవడానికి అర్హులు కారు), శూద్రులు చదువుకోవడానికి వీల్లేదు, పంచములను అంటుకోరాదు వంటి అమానుష భావనలను సమాజంపై రుద్దారు. ఈ విషయం ప్రధానికి తెలియదా? అని ఆయన ప్రశ్నించారు. శూద్రుడు చదువుకోకూడదు, పంచములు నేర్చుకోకూడదు, మహిళలకు మానవ హక్కులు ఉండకూడదని ప్రధాని భావిస్తున్నారా? శ్రీ నారాయణగురు వంటి హిందూ సంస్కర్తలను బిజెపి తిరస్కరిస్తోందా? గురువు సనాతనధర్మాన్ని బాహాటంగానే తిరస్కరించాడు. సనాతన ధర్మం వుంటే నేడు హిందువులు పునరుజ్జీవనోద్యమ విలువలతో జీవించగలరా? ఇప్పుడు, సనాతనధర్మ ఆలోచనలను సవరించగలిగితే, వేటిని సవరిస్తారు? బ్రాహ్మణిజం సంస్కరించ బడుతుందా - అని బేబి అడిగారు.

పత్తికొండ టమాటా మార్కెట్

టమాటా ధర పతనం
- పత్తికొండలో 20 కేజీల బాక్స్ రూ.50

ప్రజాశక్తి- తుగ్గలి (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా పత్తికొండ టమాటా మార్కెట్‌లో గురువారం 20 కేజీల టమాటా బాక్స్ ధర రూ.50 మాత్రమే పలికింది. అంటే, కిలో టమాటాకు రూ.2.50కు మాత్రమే ధర లభించింది. దీంతో, కనీసం ఆటో కిరాయి కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ నియోజకవర్గ పరిధిలో గతేడాది సుమారు 6,652 ఎకరాల్లో టమాటాను సాగు చేశారు. ఈ ఏడాది 2,929 ఎకరాల్లో మాత్రమే ఈ పంట సాగులో ఉంది. అయినా, రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. 20 కిలోమీటర్ల దూరం నుంచి కూడా రైతులు ఆటోల్లో టమాటాను పత్తికొండ మార్కెట్‌కు తెచ్చి అమ్ముతుంటారు. వర్షాలు కురుస్తుండడంతో రవాణా సమస్యలు వస్తాయనే కారణంతో టమాటా కొనుగోలుకు వ్యాపారులు మొగ్గు చూపడం లేదని, అందుకే ధర పడిపోయిందని అధికారులు చెప్తున్నారు. పత్తికొండలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఉంటే ధర ఇంతగా పడిపోయి ఉండేది కాదని రైతులు అంటున్నారు. ఎకరా విస్తీర్ణంలో టమాటా సాగుకు రూ.50 వేల వరకు ఖర్చవుతోందని చెప్తున్నారు. జులై, ఆగస్టు టమాటాకు మంచి ధర పలికింది. ఒక దశలో కిలో రూ.200 వరకూ ధర పలికింది. ఇప్పుడు ధర పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి టమాటా ప్రాసెస్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

తీవ్ర నష్టం

రాజన్న, టమాటా రైతు, హంప గ్రామం

మూడు ఎకరాల్లో టమాటా సాగు చేశాను. ఇప్పటికే రూ.50 వేలు వరకూ పెట్టుబడి పెట్టాను. తగిన ధర వస్తుందని ఎంతో ఆశ పడ్డాను. ఇప్పుడు ధర పూర్తిగా పడిపోవడంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంది. తీవ్రంగా నష్టపోతున్నాను.

ఆటో ఛార్జీలూ రావడం లేదు

శ్రీనివాసులు, టమాటా రైతు, దూదెకొండ

నాకున్న ఐదు ఎకరాల్లో ప్రస్తుతం రెండు ఎకరాల్లో టమాటా వేశాను. ప్రస్తుతం ధర పడిపోవడంతో ఆటోలు ఛార్జీలు కూడా రావడం లేదు. 20 కిలోల బాక్స్‌కు రూ.50 మాత్రమే అమ్ముడవుతోంది.

అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు

సత్తార్, టమాటా రైతు, మద్దికెర

4.5 ఎకరాల్లో టమాటా సాగు చేశాను. అప్పులు చేసి లక్షల్లో పెట్టుబడి పెట్టాను. ధర పడిపోవడంతో అప్పులెలా తీర్చాలో అర్థం కావడం లేదు. టమాటాకు గిట్టుబాటు ధర కల్పించాలి. టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి.

ఒకే ఫ్రేమ్‌లో భూమి, చంద్రుడు
- ఆదిత్య ఎల్-1 సెల్ఫీ



న్యూఢిల్లీ : సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 విజయవంతంగా దూసుకెళ్తోంది. ఈ క్రమంలోనే భానుడి దిశగా పయనిస్తోన్న ఆదిత్య ఓసారి పుడమిని చూసి మురిసి పోయింది. ఈ సమయంలోనే తొంగి చూస్తున్నట్లు చందమామ కూడా కనిపించింది. ఆ దృశ్యాన్ని క్లిక్ మనిపించి పనిలో పనిగా నేను క్షేమమే అన్నట్లు ఓ సెల్ఫీ కూడా తీసుకుని ఇస్రోకు పంపింది. ఆ అద్భుత దృశ్యాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఎక్స్ (ట్విట్టర్)లో షేర్ చేసింది. ఈ నెల 4న ఆదిత్య ఎల్-1లోని కెమెరా ఈ సెల్ఫీ తీసినట్లు ఇస్రో వివరించింది. ఈ చిత్రంలో ఆదిత్య ఎల్-1లోని విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్, సోలార్ అల్ట్రావయోలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ కనిపించాయి. దీంతోపాటు భూమి, చంద్రుడు ఒకేసారి కనిపించిన దృశ్యాలను కూడా ఆదిత్య క్లిక్‌మనిపించింది. ఈ వీడియోను ఇస్రో సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది. 'భూమి-సూర్యుడి మధ్యలోని లగ్రాంజ్ పాయింట్‌కు ప్రయాణంలో ఆదిత్య ఎల్-1 వీక్షించిన దృశ్యాలివి' అని ఇస్రో రాసుకొచ్చింది. ఆదిత్య ఎల్-1లోని విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్.. సూర్యుడి కరోనా, స్పెక్ట్రోస్కోపీని అధ్యయనం చేయనుంది. ఇక స్యూట్ ఫొటోస్పియర్, క్రోమోస్పియర్‌ను పరిశీలించనుంది. ఈ నెల 2న ఇస్రో ఈ ప్రయోగం చేపట్టింది. ఇటీవలే రెండోసారి భూకక్ష్య పెంపు విన్యాసాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ విన్యాసంతో ఆదిత్య ఎల్-1 ఉపగ్రహం 282 కిలోమీటర్ల X 40,225 కిలోమీటర్ల కక్ష్యలోకి ప్రవేశించింది. తదుపరి కక్ష్య పెంపు విన్యాసాన్ని ఈ నెల 10న చేపట్టనున్నారు. ఆదిత్య ఎల్-1 నాలుగు నెలలపాటు ప్రయాణించి భూమి నుంచి సూర్యుడి దిశగా ఉన్న 'ఎల్-1' (లగ్రాంజ్) పాయింట్‌ను చేరుకోనుంది. 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని ఈ ప్రదేశంలోకి భారత్ చేరుకోవడం ఇదే తొలిసారి అవుతుంది. ఈ ప్రదేశం నుంచి ఎలాంటి అవరోధాల్లేకుండా సూర్యుడిని నిరంతరం అధ్యయనం చేసే వీలుంది. ఇందులో ఏడు రకాల పరిశోధన పరికరాలున్నాయి. ఇవి సూర్యుడి పొరలైన ఫొటో స్పియర్, క్రోమోస్పియర్ సహా వెలుపల ఉండే కరోనానూ అధ్యయనం చేస్తాయి. సౌర జ్వాలలు, సౌర రేణువులు, అక్కడి వాతావరణం గురించి ఎన్నో అంశాలను శోధిస్తాయి.

ఇది ఆసియా శతాబ్దం !
- సహకార విస్తరణే లక్ష్యం
- ఆసియాన్‌తో కలిసి పనిచేస్తాం
- సదస్సులో 12 సూత్రాలను ప్రతిపాదించిన మోడీ

ఆసియాన్ నేతలతో నరేంద్ర మోడీ

జకార్తా : స్వేచ్ఛ, పారదర్శకతలతో కూడిన ఇండో-పసిఫిక్ ప్రాంతం దిశగా పురోగమించాలని, అంతర్జాతీయ పేద దేశాల వాణిని వినిపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కోరారు. ఆసియాన్, భారత్ మధ్య సహకారాన్ని మరింత విస్తరించుకోవాల్సిన అవసరముందని అన్నారు. మూడు రోజుల ఆసియాన్ సమ్మిట్ చివరి రోజు సమావేశంలో మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా 12 పాయింటతో కూడిన ప్రతిపాదనలను ఆయన సదస్సుకు అందచేశారు. అనుసంధానత, వాణిజ్యం నుండి డిజిటల్ పరివర్తన వరకు వివిధ రంగాల్లో తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించారు. అభివృద్ధికి కేంద్రంగా ఆసియాన్ వుందని, భారత్, ఆసియాన్ గ్రూపుతో కలిసి పనిచేయడానికి కట్టుబడి వుందని చెప్పారు. "21వ శతాబ్ద ఆసియా శతాబ్దం. ఇది మన శతాబ్దం. ఇందుకోసం, మానవాళి సంక్షేమం కోసం కోవిడ్ అనంతర కాలంలో నిబంధనల ప్రాతిపదిక వ్యవస్థను నిర్మించుకోవాల్సిన అవసరం వుందని అన్నారు. ఆసియాన్, భారత్‌లు విలువలను, ప్రాంతీయ సమైక్యతను, శాంతి, సౌభాగ్యాలను పంచుకుంటున్నాయని అన్నారు. మన చరిత్ర, భౌగోళికతలు ఆసియాన్, భారత్‌లను కలుపుతున్నాయన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం పట్ల మనకు గల నమ్మకం కూడా మనల్ని కలిపి వుంచుతోందన్నారు. ఈనాడు అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్నప్పటికీ ప్రతీ రంగంలోనూ మన పరస్పర సహకారంలో పురోగతి సాధిస్తునే వున్నామన్నారు. బహుళ నమూనాలతో కూడిన అనుసంధానతను ఏర్పాటు చేయాలని, ఆగ్నేయాసియా, భారత్, పశ్చిమాసియా, యూరప్‌లను అనుసంధానిస్తూ ఆర్థిక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. సముద్ర జలాల సహకారంపై, ఆహార భద్రతపై రెండు సంయుక్త ప్రకటనలు సదస్సులో ఆమోదించారు. డిజిటల్ పరివర్తన, ఆర్థిక అనుసంధానత రంగాల్లో సహకారంపై దృష్టి కేంద్రీకరించేందుకు ఆసియాన్-భారత్ నిధిని ఏర్పాటు చేయడం కూడా మోడీ చేసిన ప్రతిపాదనల్లో వుంది. ఆసియాన్, తూర్పు ఆసియా ఆర్థిక పరిశోధనా సంస్థను పునరుద్ధరించేందుకు మద్దతునివ్వడంపై ప్రకటన చేయాలని మోడీ కోరారు.

చిక్కిన మరో చిరుత
- యాత్రికుల భద్రత విషయంలో రాజీపడం : టిటిడి ఛైర్మన్

● లోపలి పేజీలో.. ●

చంద్రబాబు సభను అడ్డుకుంటాం : మాధవ్
- నిలువరించిన పోలీసులు

వాయిస్‌తోనూ యుపిఐ చెల్లింపులు
- రూపొందించిన ఎన్‌పిసిఐ

న్యూఢిల్లీ : యుపిఐ యాప్‌ల ద్వారా ఇకపై వాయిస్‌తోనూ నగదు చెల్లింపులు జరిపేలా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) టెక్నలాజీని అభివృద్ధి చేసింది. కృత్రిమ మేధ (ఎఐ) ఆధారిత వ్యవస్థతో సంభాషించడం ద్వారా లావాదేవీలు పూర్తి చేయవచ్చు. ఈ సౌలభ్యాన్ని 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2023'లో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ లాంచనంగా ఆవిష్కరించారు. యుపిఐ, యుపిఐ లైట్ ఎక్స్, ట్యాప్‌అండ్‌పే, వాయిస్ ద్వారా చెల్లింపుల కోసం హలో యుపిఐ, బిల్‌పే కనెక్ట్ తదితర ఐదు చెల్లింపు విధానాలను అందుబాటులోకి తెచ్చినట్లు శక్తికాంత దాస్ వెల్లడించారు. యుపిఐ లైట్‌ఎక్స్ ద్వారా ఇంటర్నెట్ లేకపోయిన చెల్లింపులు చేయడానికి వీలుందన్నారు. యుపిఐ క్రెడిట్ లైన్ ద్వారా బ్యాంకులు ముందుగా మంజూరు చేసిన రుణ పరిమితిని ఉపయోగించుకోవచ్చన్నారు.

వరికి నీరు ఇవ్వలేం!
- సాగర్ ఆయకట్టుపై సమీక్షలో మంత్రి అంబటి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులు వరి పంట వేయవద్దని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు కలెక్టరేట్‌లో గురువారం జిల్లా సాగు నీటి సలహా మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో అంబటి మాట్లాడుతూ సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు ఆరు తడి పంటలు మాత్రమే వేసుకోవాలన్నారు. ఈ ఏడాది వర్షాభావం వల్ల సాగు నీటి కొరత ఉందని తెలిపారు. సాగర్ ఆయకట్టు పరిధిలో గతంలో ఎన్నడూ లేనంతగా తక్కువ వర్షపాతం నమోదైందని చెప్పారు. ఈ దృష్ట్యా ఆరుతడి పంటలకు మాత్రమే నీరిస్తామని, వారాబంది అమలు చేస్తామని తెలిపారు. రైతులు అర్థం చేసుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతి నీటిబొట్టునూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

తప్పు చేశారు కాబట్టే చంద్రబాబు భయపడుతున్నారు

చట్టం దృష్టిలో ఎవరైనా ఒక్కటేనని మంత్రి అంబటి అన్నారు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టి ఆయనకు భయమేస్తోందని చెప్పారు. చంద్రబాబును అరెస్టు చేయాల్సిన అవసరముంటే అరెస్టు చేస్తారన్నారు. ప్రాథమిక ఆధారాలు లేనిదే ఎవరి మీదా ఏ విధమైన కేసులూ పెట్టరని చెప్పారు. చంద్రబాబు తనను అరెస్ట్ చేస్తారని సానుభూతి పొందే మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు రూ.118 కోట్లు ముడుపులు తీసుకున్నట్లు ఆధారాలున్నా పవన్ కల్యాణ్ నోరు విప్పరని, ఆయనను హీరోయే అని అంటారని అంబటి విమర్శించారు. వాళ్లిద్దరికీ మధ్య ఉన్న బంధం, సంబంధం అలాంటిదని వ్యాఖ్యానించారు.

చెట్ల నరికివేతపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

వివిధ పనుల పేరుతో అడ్డం వచ్చాయని చెట్లను కూల్చేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రోడ్ల నిర్మాణాలు, విద్యుత లైన్ల ఏర్పాటు, ఇతర పనుల పేరుతో ఇష్టానుసారంగా చెట్ల కూల్చివేతలకు పాల్పడితే ఊరుకోబోమని తేల్చి చెప్పింది. చెట్లను సురక్షితంగా వేరే చోట్ల పాతడం, నష్టం కలిగించిన చెట్లకు ప్రత్యామ్నాయంగా మొక్కలు నాటడం చేయాలని, ఈ మేరకు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ కూడా ఉన్నాయని తెలిపింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్, అటవీ, విద్యుత్‌శాఖల ముఖ్య కార్యదర్శులు, ఎపి సుందరీకరణ, పచ్చదన కార్పొరేషన్ల కౌంటర్లు దాఖలు చేయాలని న్యాయమూర్తులు జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కొట్టిన చెట్లను తిరిగి నాటేలా ఆదేశాలివ్వాలని కోరుతూ గుంటూరుకు చెందిన వైద్య విద్యార్థి అస్మద్ మహ్మద్ షేక్ షా వేసిన పిల్‌పై విచారణను ఈ నెల 20కు వాయిదా వేసింది.

30 నుంచి జగనన్న 'ఆరోగ్య సురక్ష'
- 15 నుంచి వలంటీర్ల ఇంటింటి సర్వే
- సమీక్షలో మంత్రి రజిని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ఈ నెల 30 నుంచి ప్రారంభించాలని సంబంధిత అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని పేదలకు ఆరోగ్య భరోసా దక్కుతుందని మంత్రి అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించడం, అవసరమైనవారికి గ్రామాల్లోనే క్యాంపులు నిర్వహించి వైద్యం అందించడం, పెద్దాస్పత్రులకు సిఫార్సు చేయడం లక్ష్యంగా ఆరోగ్య సురక్ష పథకాన్ని సిఎం జగన్ తీసుకొచ్చారని చెప్పారు. ఇంట్లో ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి ఎఎన్‌ఎంలు క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇస్తారని చెప్పారు. తర్వాత ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు ఇంటింటికీ వస్తారని, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అదే గ్రామం, వార్డుల్లో వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తారని వివరించారు. ఈ శిబిరాలు జరిగే సమయానికి అందరికీ ఆరోగ్య నివేదికలను ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు సిద్ధం చేసి ఉంచుతారని తెలిపారు. ఈ వైద్య శిబిరాలకు ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, ఆ మండలంలోని పిహెచ్‌సికి చెందిన ఇద్దరు డాక్టర్లు వస్తారని, రోగులకు చికిత్స చేసి ఆరోగ్య సలహాలు ఇస్తారని చెప్పారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి ఒక స్పెషలిస్టు డాక్టర్ హాజరవుతారని తెలిపారు. నెలరోజుల పాటు ప్రతిరోజూ ఈ క్యాంపులు జరుగుతాయన్నారు. మండలానికి ఒక గ్రామం చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రోజూ వైద్య శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 30న తొలి శిబిరం నిర్వహించాలని ఆదేశించారు. వైద్య శిబిరం వద్ద 105 రకాల మందులు, అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఇంటింటికీ వలంటీర్ల సందర్శన ఈ నెల 15 నుంచి మొదలుకావాలన్నారు. 16 నుంచి ఎఎన్‌ఎంల సందర్శన ప్రారంభమవ్వాలన్నారు.

చంద్రబాబు సభను అడ్డుకుంటాం : మాధవ్

- నిలువరించిన పోలీసులు

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తప్పుడు పుట్టుక పుట్టారని, టిడిపి అధినేత చంద్రబాబు వ్యక్తిగత విమర్శలు చేయడంపై హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వ్యక్తిగత విమర్శలు చేసిన చంద్రబాబు సభను అడ్డుకుని తీరుతానని కార్యకర్తలతో కలిసి బయలుదేరిన మాధవ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు నిలువరించారు. దీంతో, ఆయన తన ఇంటి సమీపంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అంతకు మునుపు విలేకరుల సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ..మాజీ సిఎం చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. విద్యుత్ కోతలపై మాట్లాడే చంద్రబాబు, ఉచిత విద్యుత్ ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవడానికి ఉపయోగపడతాయని పేర్కొన్న మాట అవాస్తవమా? అని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో పట్టుబడిన చంద్రబాబునాయుడు దొంగ ఓట్ల గురించి మాట్లాడటం దొంగే దొంగా దొంగా అన్నట్లు ఉందని విమర్శలు గుప్పించారు. ఈ విలేకరుల సమావేశంలో ముదిగుబ్బ మండలాధ్యక్షులు ఆదినారాయణ, వసికేరి రమేష్, రామగిరి రమేష్, మడకశిర నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్కరణలు భేష్

- నోబెల్ గ్రహీత మైకేల్ క్రేమెర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యా సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయని నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ మైకేల్ క్రేమెర్ ప్రశంసించారు. సమగ్ర శిక్ష కార్యాలయాన్ని మైకేల్‌తోపాటు చికాగోలోని డిఐఎల్ యూనివర్సిటీకి చెందిన ఎమిలీ క్యుపిటో బృందం గురువారం సందర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యాభివృద్ధికి చేపడుతున్న పథకాలు, కార్యక్రమాల గురించి పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్ కుమార్, సమగ్ర శిక్ష డైరెక్టరు బి శ్రీనివాసరావు వివరించారు. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన రాష్ట్రంలో పర్సనలైజ్‌డ్ అండ్ ఆడ్పాటివ్ లెర్నింగ్ (పిఎఎల్) ప్రాజెక్టు అమలు చేస్తున్న పాఠశాలలను ఈ బృందం సందర్శించనుంది. ఏలూరు జిల్లాలో వివిధ పాఠశాలలను సందర్శించనుంది. ఈ సందర్భంగా సురేష్ కుమార్, శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడానికి పిఎఎల్ చొరవ అపారమైనదని అన్నారు.

విజయవాడ ప్రకాశం బ్యారేజి వద్ద దిగువకు వరద నీరు విడుదల చేసిన దృశ్యం

ప్రకాశం బ్యారేజీకి వరద

- సముద్రంలోకి 11,130 క్యూసెక్కుల నీటి విడుదల

ప్రజాశక్తి - విజయవాడ

ఎగువన కురుస్తున్న వర్షాలకు గురువారం కృష్ణా నదికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి నీటిని సముద్రంలోకి జలవనరుల శాఖ అధికారులు విడుదల చేశారు. బ్యారేజీకి ఎగువన ఉన్న మునేరు, కట్టలేరు, వైరా ఏరు తదితర వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉదయం 9 గంటలకు ప్రకాశం బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో 21,306 క్యూసెక్కులుగా ఉంది. దీంతో, బ్యారేజీకి చెందిన 15 గేట్లను అడుగు మేర పైకి ఎత్తి 11,130 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు. కాల్వలకు 10,176 క్యూసెక్కులు విడుదల చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు బ్యారేజీ వద్ద వరద నీరు మరింత పెరిగింది. ఇన్‌ఫ్లో 22,756 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో బ్యారేజీకి చెందిన 17 గేట్లను అడుగు మేర పైకి ఎత్తి 12,580 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కాల్వలకు 10,176 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద నీటి మట్టం 12 అడుగులుగా ఉంది.

నకిలీ మందుల విక్రయాలపై అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - విజయవాడ వన్‌టౌన్,అర్బన్ :

విజయవాడ వన్‌టౌన్, గొల్లపూడి పరిధిలోని పలు మందుల షాపుల్లో నకిలీ మందుల విక్రయాల వ్యవహారాన్ని డ్రగ్ అండ్ కంట్రోలర్ అధికారులు గుర్తించారు. కార్డియాక్, ఫీవర్, అల్సర్, బిపి, షుగర్, గ్యాస్, పెయిన్‌కు సంబంధించి నకిలీ మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పరీక్షల నిమిత్తం కొన్ని మందులను ల్యాబ్‌కు పంపారు. లైసెన్స్ లేని మందుల షాపుల వారు బిల్లులు లేకుండా అమ్మకాలు, కొనుగోలు సాగిస్తున్నట్లు గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా మందుల షాపులు, డ్రగ్ ఏజెన్సీలు, ఫార్మసీల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు.

గాడిదలను రక్షించండి

ప్రజాశక్తి-అమరావతి

గాడిదల వధను కట్టడి చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. గాడిదల వధతోపాటు వేరే రాష్ట్రాల నుంచి గాడిదల దిగుమతులను అడ్డుకోవాలని కోరుతూ జంతు హక్కుల ఉద్యమకారులు శికళ, జాగు సురేష్ వేసిన పిల్‌ను న్యాయమూర్తులు జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. గాడిదలను వధించే వాళ్లను శిక్షించాలంది. ప్రతివాదులైన భారత జంతు సంక్షేమ బోర్డు ఛైర్మన్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డిజిపి, పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శి ఇతరులు కౌంటర్ దాఖలు చేయాలంది. విచారణను వచ్చే నెల 4కు వాయిదా వేసింది.

అందని 'తోటపల్లి' నీరు

- అదనపు ఆయకట్టు లక్ష్యం 1.46 లక్షల ఎకరాలు
- అందింది 71 వేల ఎకరాలకే
- శివారు భూములకు చేరని నీరు
- ఆందోళనలో రైతులు


చుక్క నీరులేని తోటపల్లి కుడి కాలువ

జిల్లా	అదనపు ఆయకట్టు సాగునీటి లక్ష్యం (ఎకరాల్లో)	ప్రస్తుతంఅందిన నీరు (ఎకరాల్లో)
విజయనగరం	93,563	48,985
పార్వతీపురం మన్యం	13,684	6,200
శ్రీకాకుళం	38,974	16,607
మొత్తం	**1,46,221**	**71,792**

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సాగునీటి ప్రదాయినిగా చెప్పుకుంటున్న సర్దార్ గౌతు లచ్చన్న సాగు నీటి జలాశయం నీరు అదనపు ఆయకట్టుకు లక్ష్యానికి అనుగుణంగా అందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు పరిస్థితి దయనీయంగా ఉంది. చాలాచోట్ల వరి నాట్లు పడలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే వేసిన వరి నాట్లు కూడా బతికే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ జలాశయం స్థిరీకరణ ఆయకట్టు 64 వేల ఎకరాలు. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మరో 1,46,221 ఎకరాలకు సాగు నీరందించేందుకు తోటపల్లి ప్రాజెక్టును విస్తరించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ప్రాజెక్టు, కుడి కాలువ పనులు పూర్తి చేసినట్టు ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో లక్ష్యానికి తగ్గట్టు సాగు నీరు అందడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం... ఈ ఖరీఫ్ సీజన్లో కుడి కాలువ ద్వారా ఇప్పటి వరకు 71,792 ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందింది. పిల్ల కాలువలు, స్ట్రక్చర్లు అసంపూర్తిగా ఉన్నాయి. ఇటీవల కాలంలో ప్రధాన కాలువల నిర్వహణ అధ్వానంగా ఉంది. సుమారు 113 కిలోమీటర్ల పొడవుగల ఈ కాలువ సుమారు 50 కిలోమీటర్ల మేర (దాదాపు తెర్లాం మండలం నుంచి కాలువ చీపురుపల్లి వరకు) గడ్డి, అగురు వంటి పిచ్చి మొక్కలతో నిండి ఉంది. దీనికితోడు గడిచిన ఆరు నెలల్లో సీతానగరం, బొబ్బిలి మండలాల్లో కాలువకు మూడుసార్లు గండిపడింది. ఇలాంటి అవాంతరాల వల్ల సాగునీరందకపోవడంతో రైతులు ఆశ, నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా ప్రాజెక్టుకు చివర ఉన్న విజయనగరం జిల్లా నెల్లిమర్ల, చీపురుపల్లి, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు చుక్కనీరు కూడా అందడం లేదు. చీపురుపల్లి నియోజకవర్గంలో 25,121 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఇప్పటి వరకు 17,252 ఎకరాలకు మాత్రమే అందినట్టు అధికారిక లెక్కలు తెలియజేస్తున్నాయి. అయితే, అసలు నీరే రాలేదని కొందరు రైతులు, కాలువల్లో నీరు తోడుకుని నాట్లు వేశామని మరికొందరు రైతులు 'ప్రజాశక్తి'కి చెప్పారు. ఈ నియోజకవర్గం పరిధిలోని గడిగెడ్డ ద్వారా 2,900 ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. ఈ ఏడాది చుక్క నీరు కూడా అందలేదని గుర్ల మండలంలోని పకీరు కిత్తలి, పల్లెగండ్రేడు, కొండగండ్రేడు, ముద్దాడపేట, గరికివలస, తెట్టంగి, గూడెం, పున్నపురెడ్డిపేట, పాలవలస, ఘోషాడ గ్రామాల రైతులు తెలిపారు. తోటపల్లి నీరు రాకపోతే వరి నాట్లను బతికించుకోవడం కష్టమేనని, మదుపులు కూడా ఎక్కువగా అవ్వడం వల్ల అప్పుల్లో కూరుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రౌతు రమణ అనే రైతు 'ప్రజాశక్తి' వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. రైతులు వర్షపు నీటిని ఒడిసిపట్టి 80 శాతం భూముల్లో అతి కష్టమ్మీద వరి నాట్లు వేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 13,227 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. 1,627 ఎకరాలకు సాగునీరు అందించినట్టు అధికారులు చెప్తున్నారు. గతేడాది ఇదే సమయానికి శ్రీకాకుళం జిల్లాలో దీని ఆయకట్టు పరిధిలోని 20,437 ఎకరాలకు సాగు నీరందగా, ప్రస్తుతం 16,607 మాత్రమే అందింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 38,974 ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం 1627 ఎకరాలకే అందింది. బొబ్బిలి, రాజాం తదితర నియోజకవర్గంలోనూ అంతంతమాత్రంగానే నీరు అందినట్లు అధికారుల రికార్డులు తెలియజేస్తున్నాయి.

తోటపల్లి నీరు రాకపోతే అప్పులపాలే

తోటపల్లి జలాశయం నుంచి నీరు రాకపోతే ఈ ఏడాది అప్పులపాలే. గతంలో ఎంతోకొంత నీరు రావడంతో ఆశించిన దిగుబడి వచ్చింది. ప్రస్తుతం వర్షపు నీటితో నాట్లు వేశాం. ఇప్పటికీ చెరువులు నిండలేదు. ఎకరాకు రూ.25 వేలు చొప్పున మదుపుపెట్టాం. మునుపెన్నాడూ ఈ పరిస్థితి లేదు.

-పోతిన పాత్రుడు, రైతు, తాటిపూడి, గుర్ల మండలం

బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

మా విధానం అభివృద్ధి

- వైసిపిది విధ్వంసం
- సాగును చంపి.. రైతును ముంచేశాడు
- పేదవాడి లండన్ యాత్రకు నలభై కోట్లు..!
- 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' యాత్రలో చంద్రబాబు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి, ప్యాపిలి

మా విధానం అభివృద్ధి.. వైసిపిది విధ్వంస విధానం అని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అన్నారు. తన కుమార్తెల మీద ప్రేమతో పేదవాడైన ముఖ్యమంత్రి సాగిస్తున్న లండన్ యాత్రకు రూ.40 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టారని విమర్శించారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' యాత్ర అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, గుంతకల్లు, గుత్తి, నంద్యాల జిల్లా ప్యాపిలిలో కొనసాగింది. దీంతో అనంతపురం జిల్లాలో మూడు రోజుల పర్యటన ముగిసింది. తొలుత కళ్యాణదుర్గంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడమే కాకుండా తాము అధికారంలోకి వస్తే ఏ విధానాలు తీసుకొస్తామన్నది వివరించారు. సాగును చంపి, రైతును నిండా ముంచేసిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. పొలాల ముఖం చూడని ముఖ్యమంత్రికి రైతుల సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఏ ఒక్క ప్రాజెక్టును ఈ నాలుగేళ్ల కాలంలో పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. పోలవరం పూర్తి చేసి గోదావరి జలాలను కృష్ణాకు తరలించి, మిగులు జలాలను రాయలసీమకు అందివ్వాలన్నది తన లక్ష్యమని తెలిపారు. ఈ నాలుగేళ్లలో పోలవరాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం అనంతరం అనంతపురం మీదుగా గుత్తికి వెళ్తుండగా మార్గమధ్యలో ఇస్కాన్ టెంపుల్‌లోకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుత్తి బహిరంగ సభలో పాల్గొన్ని, ప్రసంగించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై భారాలు వేస్తూనే ఉందన్నారు. కర్ణాటక కంటే ఇక్కడ లీటరు పెట్రోల్‌పై రూ.11.40 అదనంగా ఉందన్నారు. దీని వలన ఒక్క ఆటో డ్రైవర్‌పై ఏడాదికి రూ.20 వేలకు పైగా అదనపు భారం పడుతోందన్నారు. గ్రీన్ ట్యాక్సు, పన్ను పెంపు తదితర వాటి వల్ల లారీ యజమానులపైనా భారం మోపారని విమర్శించారు. ప్యాపిలి ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో చంద్రబాబు మాట్లాడుతూ.. టిడిపి గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, జగన్ ఓటమి ఖాయమైందని తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల్లో అధికార పార్టీకి గట్టి బుద్ధిచెప్పారన్నారు. వైసిపి పార్టీని కూకటి వేళ్ళతో పెకిలించాలని కోరారు.

మెరుగైన ఇసుక పాలసీ తీసుకొస్తాం : నారా లోకేష్

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

వైసిపి ఇసుక మాఫియా కారణంగా 40 లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని, గత నాలుగేళ్లలో జగన్ అండ్ కో రూ.40 వేల కోట్లు దోపిడీకి పాల్పడిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమనిధి సొమ్ము రూ.2 వేల కోట్లు జగన్ ప్రభుత్వం దొంగిలించిందని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మెరుగైన ఇసుక పాలసీ తీసుకొచ్చి కార్మికులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర 207వ రోజుకు చేరింది. గురువారం సీతారామపురం నుంచి ప్రారంభమైన యాత్ర నరసాపురం పట్టణం, సరిపల్లి, చించినాడ, మీదుగా కలగంపూడికి చేరింది. యాత్రలో భాగంగా భవన నిర్మాణ కార్మికులు, చేనేత కార్మికులు, తూర్పుకాపులు, మత్స్యకారులతో లోకేష్ సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థ పాలన కారణంగా చేనేతరంగం సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. చేనేత కార్మికులకు గుర్తింపుకార్డులిచ్చి సంక్షేమ పథకాలన్నీ అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామని ప్రకటించారు. తూర్పుకాపులను ఒబిసిలుగా గుర్తించే అంశంపై కేంద్రానికి లేఖ రాస్తానన్నారు. టిడిపి అధికారం చేపట్టిన రెండేళ్లలో నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సరిపల్లిలో అగ్నికుల క్షత్రియులతో లోకేష్ మాట్లాడుతూ.. చెరువులను పెత్తందారులకు అప్పజెప్పేందుకు తీసుకొచ్చిన జిఓ 217ను తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రద్దు చేస్తామన్నారు. లేస్ పరిశ్రమకు రాయితీలిచ్చి, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, శాసనమండలి మాజీ చైర్మన్ షేక్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పాల్గొన్నారు.

39 మంది యువగళం వలంటీర్లకు రిమాండ్

భీమవరంలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణకు సంబంధించి పోలీసులు అరెస్టు చేసిన 39 మంది యువగళం వలంటీర్లను బుధవారం రాత్రి రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారని వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ తెలిపారు. వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించమన్నారు. ఈ కేసుల్లో ఉన్న మిగిలిన టిడిపి నేతలను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు.

అగ్నికుల క్షత్రియుల పనిముట్లు వల, బుట్టతో లోకేష్

ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

- జంఝావతి కాలువకు గండి
- సాకిగెడ్డ ఉప్పొంగడంతో 45 గ్రామాలకు రాకపోకలు బంద్

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తరాంధ్రలో పలుచోట్ల గురువారం భారీ వర్షాలు కురిశాయి. విజయనగరం జిల్లాలో మోస్తారుగా, మన్యం జిల్లాలో భారీ వర్షాలు పడ్డాయి. వీరఘట్టం మండలం నడుకూరు గ్రామంలో 100 ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. వట్టిగెడ్డలో నీటి ప్రవాహం అమాంతంగా పెరిగింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామం మీదుగా గరుగుబిల్లి వెళ్తున్న జంఝావతి కాలువకు గండి పడింది. దీంతో పార్వతీపురం- పాలకొండ రోడ్డుపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. పుట్టూరు - లచ్చిరాజుపేట గ్రామాల మధ్య ఉన్న సాకిగెడ్డ ఉప్పొంగి ప్రవహించడంతో సుమారు 45 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తోటపల్లి రిజర్వాయర్‌కు వరద ఉధృతి పెరిగింది. నీటి నిల్వ సామర్థ్యం 297 అడుగులు కాగా, ప్రస్తుతం 289 అడుగులు నమోదైంది. ఇన్‌ఫ్లో 550 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 170.48 క్యూసెక్కులుగా ఉంది.

విశాఖలోని ఇంట్లోకి వచ్చిన వర్షపునీటిని బకెట్‌తో బయటకు తోడుతున్న మహిళ

శ్రీకాకుళం జిల్లా సోంపేటలో అత్యధికంగా 33.75మిల్లీమీటర్లు, కవిటి మండలం రాజపురంలో అత్యల్పంగా 0.25 మి.మీ వర్షపాతం నమోదైంది. విశాఖలో జోరు వాన కురిసింది. జగదాంబ, పూర్ణా మార్కెట్, ప్రసాద్ గార్డెన్స్, ఎంవిపి.కాలనీ, ద్వారకానగర్, మద్దిలపాలెంలోని లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరాయి. కొన్ని ఇళ్లలోకి వరద నీరు చేరింది. అనకాపల్లి జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. అల్లూరి జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. అనంతగిరి మండలంలోని గోస్తనీ, లుంగపర్తి గెడ్డలు, విఆర్.పురం, చింతూరు మీదుగా ప్రవహించే జల్లివారిగూడెం గెడ్డ పొంగి ప్రవహిస్తున్నాయి.

చంద్రబాబుకు ముడుపులపై పవన్ స్పందించాలి

- ఎంపి నందిగం సురేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి నిర్మాణంలో చంద్రబాబుకు అందిన ముడుపుల వ్యవహారంలో ఐటిశాఖ ఇచ్చిన నోటీసులపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని వైసిపి ఎంపి నందిగం సురేష్ ప్రశ్నించారు. ఈ ముడుపుల్లో పవన్‌కల్యాణ్‌కు వాటాలు అందినందునే మాట్లాడటం లేదని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతిలో చోటుచేసుకున్న అవినీతి కుంభకోణంలో చంద్రబాబు ఇరుక్కుపోయారని, అందుకే ముడుపులపై మాట్లాడకుండా తప్పించుకునేందుకు తనను అరెస్టు చేస్తారని మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ అవినీతి నుంచి చంద్రబాబు అరెస్టు కాక తప్పదని అన్నారు. ఆయన తప్పును ఒప్పుకుంటే ప్రజలు హర్షిస్తారని అన్నారు. ఐటి నోటీసులపై నారా లోకేష్ కూడా స్పందించకపోవడం సరైంది కాదన్నారు. లోకేష్ పరిపక్వత లేని రాజకీయం చేస్తూ రాష్ట్రంలో అల్లర్లు, గొడవలు సృష్టిస్తున్నారని విమర్శించారు.

పురందేశ్వరికి బంధుప్రీతి అడ్డు వస్తోంది : రవిచంద్రారెడ్డి

అమరావతి నిర్మాణపు కాంట్రాక్టు సంస్థల నుంచి చంద్రబాబు ముడుపులు తీసుకున్న అంశం కళ్లముందు కనిపిస్తున్నా.. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరికి మాట్లాడేందుకు బంధుప్రీతి అడ్డువస్తున్నట్లుగా వుందని వైసిపి అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు వచ్చిన నోటీసులు ఒకభాగం మాత్రమేనని, అమరావతిలో తవ్వేకొద్దీ చంద్రబాబు అవినీతి బయటకు వస్తుందని అన్నారు.

రాష్ట్రంలో సింహాలు.. ఢిల్లీలో పిల్లులు

- ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రంలో సింహాల్లా గర్జిస్తున్నాయని, ఢిల్లీలో పిల్లుల్లా వ్యవహరిస్తున్నాయని ఎపి ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని మేడికొండ శ్రీనివాస్ అతిథిగృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప, విశాఖ ఉక్కు కర్మాగారం, రాజధానికి నిధుల విడుదల, ఇతర ప్రాజెక్టులకు నిధుల విషయంలో ఢిల్లీలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పిల్లుల్లా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి, నిర్వాసితులకు పరిహారం ఇచ్చేందుకు, పునరావాసం కలిపంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో లేవన్నారు. పోలవరంను బ్యారేజీగా మార్చడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పోలవరం కాపర్ డ్యాం వివాదంపై ఐఐటి, అంతర్జాతీయ నిపుణులతో దర్యాప్తు చేయించి ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్‌కు ఏదైనా నష్టం జరిగితే గోదావరి జిల్లాలు తుడుచుపెట్టుకుపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ సమితి తరపున ఎంపి సీట్లకు పోటీ చేస్తామని, తమకు కనీసం పది సీట్లు వచ్చినా కేంద్రంపై సింహంలా గర్జిస్తామని చెప్పారు.

సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కారు గత తొమ్మిదేళ్లలో చెప్పుకోదగ్గ ఏ పథకమూ అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ, నేత పడాల రామాంజనేయులు పాల్గొన్నారు.

మార్గదర్శిలో ఫోర్జరీలతో లావాదేవీలు

- విచారణకు సహకరించడం లేదు
- సిఐడి చీఫ్ ఎన్ సంజయ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఫోర్జరీ సంతకాలతో లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని, విచారణ కోసం వెళితే సహకరించడం లేదని సిఐడి చీఫ్ ఎన్ సంజయ్ తెలిపారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్గదర్శిలో నిబంధనలు అతిక్రమించిన కేసులు తవ్వేకొద్దీ వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. మార్గదర్శి చిట్స్ నిబంధనలను పాటించడం లేదని విమర్శించారు. మార్గదర్శి మోసాలపై ఐటి, ఇడికి సమాచారమిచ్చామని అన్నారు. కోటికి పైగా చిట్స్ వేసిన వారు 800 మందికి పైగా ఉన్నారని తెలిపారు. ఇందులో 40 శాతం చిట్ గ్రూపుల్లో చందాదారులే లేరని అన్నారు. కంపెనీనే సొంతంగా చిట్స్‌ను తీసుకుంటున్నట్లు గుర్తించామని అన్నారు. చందాదారులను బెదిరిస్తూ చిట్ అమౌంట్ ఇవ్వకుండా వేధిస్తున్న కేసులు కూడా వున్నాయని తెలిపారు. గోస్ట్ సబ్ స్క్రైబర్స్ పేరుతో కంపెనీనే డబ్బులు తీసుకుంటోందని అన్నారు. కొందరు చిట్ వేయకున్నా ఫోర్జరీ సంతకాలతో వారి పేరుతో చిట్స్ నడుస్తున్నాయన్నారు. మార్గదర్శిలో చిట్స్ కడుతున్నట్లు దాదాపు మూడు వేలమందికి తెలియనే తెలియదని అన్నారు. వంద మంది ఘోస్ట్ సబ్ స్క్రైబర్స్‌ను గుర్తించి విచారించామని, ఘోస్ట్ సబ్ స్క్రైబర్స్‌కు తెలియకుండా వారి ఆధార్, ఇతర వివరాలను మార్గదర్శి వాడుకుంటోందని అన్నారు. ఒక్కో కంపెనీ 50 చిట్లు ఎలా వెయ్యగలదని ప్రశ్నించారు. జగజ్జనని కేసులో రూ.9 కోట్ల ఆస్తులు అటాచ్ చేశామని, అనుమతులు లేకుండా చిట్ గ్రూప్‌ను ప్రారంభించారని అన్నారు. చిట్ వేసిన వారిని శైలజ కిరణ్ పిఎ శశికళ ఫోన్‌లో బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఇది సిఐడి విచారణను అడ్డుకోవడం కాదా? అని ప్రశ్నించారు. అన్నపూర్ణ దేవి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని, విదేశాల్లో వున్న ఆమె కుమార్తె ప్రియాంక సంతకాన్ని ఫోర్జరీ చేశారని తెలిపారు. మార్గదర్శి బ్రాంచ్ మేనేజర్లు, ఏజెంట్లు, యజమాన్యం కలిసి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సిఐడి ఎస్‌పి కె ఫకీరప్ప పాల్గొన్నారు.

కింది కోర్టు ఉత్తర్వుల్ని సవాల్ చేసిన సిఐడి

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ ఆ సంస్థతోపాటు చెరుకూరి రామోజీరావు, శైలజా కిరణ్, ఇతరులపై పెట్టిన చార్జిషీట్లను గుంటూరు, విశాఖపట్నంలలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు వెనక్కి పంపడాన్ని హైకోర్టులో సిఐడి సవాల్ చేసింది. చార్జిషీట్‌లను రిటర్న్ చేస్తూ ప్రత్యేక కోర్టుల ఉత్తర్వులను రద్దు చేయాలంటూ సిఐడి అదనపు ఎస్‌పి దాఖలు చేసిన అప్పీళ్లను హైకోర్టు విచారణ చేయాల్సి వుంది. ఆధారాలను చార్జిషీట్‌లో పేర్కొన్నవన్నీ వాటిని ప్రత్యేక కోర్టులు పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయమని సిఐడి అప్పీల్‌లో పేర్కొంది. చార్జిషీట్‌లను రిటర్న్ చేస్తూ ప్రత్యేక కోర్టులు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలంది.

మహిళా ఉద్యోగులు నాయకత్వంలోకి రావాలి

- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ
- ఎపి ఎన్‌జిఒ మహిళా విభాగ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళా ఉద్యోగులు నాయకత్వంలోకి రావాలని, స్వయంగా సమస్యలు పరిష్కరించుకునే స్థాయికి ఎదగాలని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. ఎపి జెఎసి అమరావతి అనుబంధ ఉద్యోగ సంఘ మహిళా విభాగ ప్రమాణ స్వీకారం గురువారం విజయవాడలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన పద్మ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులకు కష్టం వస్తే పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిల్లల సంరక్షణ కోసం మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న విధంగా రెండు సంవత్సరాలు సెలవులు ఇవ్వాలని కోరారు. మహిళలపై వేధింపులు ఆపేందుకు ఇంటర్నల్ కంప్లైంట్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన కమిటీ ఛైర్‌పర్సన్ పారె లక్ష్మి, కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు ప్రొబేషన్ కాలంలో ప్రసూతి సెలవులు ఉపయోగించుకుంటే వారికి ఆ కాలాన్ని సర్వీసు కాలంగా పరిగణించి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరారు. అన్ని కార్యాలయాల్లో ఛైల్డ్ క్రెష్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిజెఎసి అమరావతి జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ ఛైర్మన్ ఫణి పేర్రాజు, కోశాధికారి మురళీకృష్ణనాయుడు పాల్గొన్నారు.

సమన్వయ కేంద్రం పనులు వేగవంతం : సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)లో భాగంగా రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమన్వయ కేంద్రం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ప్రణాళికా శాఖ కార్యదర్శి గిరిజా శంకర్‌ను ఆదేశించారు. యుఎన్‌డిపి, ఎస్‌డిజి సెంటర్ ఏర్పాటు పనుల ప్రగతిపై ప్రణాళికాశాఖ అధికారులతో సచివాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. 2015 ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో 17 అంశాల్లో సుస్థిర అభివృద్ధి, 169 నిర్దేశిత లక్ష్యాల సాధనకు సమన్వయ కేంద్రం ఏర్పాటు తప్పనిసరి అని తెలిపారు. ప్రపంచంలోని బహుముఖ రంగాల్లో పేదరికాన్ని రూపు మాపడానికి, విశ్వ శ్రేయోసమృద్ధికి, సమానమైన, న్యాయమైన, సురక్షిత ప్రపంచాన్ని రూపొందించేందుకు 2030 నాటికల్లా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాల్సి ఉందన్నారు. దీనికోసం రాష్ట్రంలో సమన్వయ కేంద్రాన్ని సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేశంలో ఇప్పటికే ఏడు రాష్ట్రాలు వీటిని ఏర్పాటు చేశాయని వివరించారు.జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను సిఎస్ కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంపై సిఎస్ సచివాలయంలో వైద్యారోగ్య, పాఠశాల విద్య, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల అధికారులతో మరో సమీక్ష నిర్వహించారు.

వృద్ధి ఉత్తదేనా...?

మొదటి పేజీ తరువాయి

దిగుమతులు పెరిగాయని వివరించారు. దీర్ఘకాల దృష్టితో చేసే మూలధన ఖర్చుల్లో కూడా పెరుగుదల లేదని వివరించారు. అన్ని రంగాల్లో ఖర్చు తగ్గుతుంటే ఆదాయం ఎలా పెరుగుతుందని ఆయన ప్రశ్నించారు. 'జిడిపి లెక్కల్లో లోపం ఉంది. ఇది మన దేశం అధికారికంగా ప్రకటించే గణాంకాల్లోని కచ్చితత్వాన్ని బోనులో నిలబెడుతుంది.' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇండియన్ నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు తాజాగా విడుదల చేసిన లెక్కల ప్రకారం ఏప్రిల్ - జూన్ నెలల మధ్య ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయం 7.8శాతం వార్షిక రేటుతో పెరిగిందని, అదే సమయంలో వ్యయం మాత్రం 1.4శాతం మాత్రమే పెరిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఆ స్థాయిలో ఆదాయం పెరిగితే ఇంత తక్కువగా వ్యయం ఎందుకు ఉంటుందని ఆయన ప్రశ్నించారు. అంతర్జాతీయ ఆర్థిక సూత్రాల ప్రకారం సాధారణ పరిస్థితుల్లో ఆదాయ, వ్యయాలు సమానంగా ఉంటాయని తెలిపారు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు మాత్రం ఆదాయ లెక్కలను మాత్రమే సరైనవిగా భావించి పరిగణలోకి తీసుకుంటుందని పేర్కొన్నారు. అమెరికాతో పాటు ఇతర దేశాలు జిడిపి గణన కోసం వ్యయాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారని. ఆ తరువాత ఆదాయ, వ్యయాల సగటును మిశ్రమంగా పరిగణలోకి తీసుకుంటారని చెప్పారు.

తిరుమల నడక దారిలో ఇనుప కంచె!

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అటవీ శాఖ
- అనుమతి వచ్చాక టిటిడి నిధులతో నిర్మాణం


నడక దారిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల నడక దారిలో ఇనుక కంచె ఏర్పాటుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా టిటిడి సూచనల మేరకు అటవీ శాఖ ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక టిటిడి నిధులతో పనులు ప్రారంభించనున్నారు. తిరుమలలో చిరుతల సంచారం రోజురోజుకూ సంచలనం కలిగిస్తోంది. చిరుతల నుంచి సందర్శకులను సంరక్షించేందుకు, వారిలోని భయాందోళనలు పోగొట్టేందుకు టిటిడి కొన్ని చర్యలు తీసుకుంది. అందులో భాగంగా నడక మార్గంలో వెళ్లే వారికి ఊత కర్రలు ఇస్తోంది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడం, సందర్శకుల్లో భయాందోళనలు తొలగకపోవడంతో తిరుమల నడక దారిలో ఇనుప కంచె ఏర్పాటు నిర్ణయానికి టిటిడి వచ్చింది. రిజర్వు ఫారెస్టులో ఉన్న నడక మార్గాల్లో ఇనుప కంచె ఏర్పాటుకు సందర్శకుల భద్రత దృష్ట్యా అనుమతి ఇవ్వాలని కేంద్ర అటవీ శాఖకు, వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు స్థానిక అటవీ శాఖ ద్వారా ప్రతిపాదనలు పంపినట్లు ఆ శాఖ అధికారి ఒకరు చెప్పారు. గత నెల 11న లక్షిత అనే చిన్నారిపై చిరుత దాడి చేసి చంపివేయడంతో నడక దారిలో చిన్న పిల్లలతో తిరుమలకు వచ్చే సందర్శకులు బిక్కుబిక్కుమంటున్నారు. దీంతో, టిటిడి అధికారులు, అటవీ శాఖాధికారులు ఆపరేషన్ చిరుత కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా అటవీ ప్రాంతంలో బోన్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే నాలుగు చిరుతలు బోనులో చిక్కగా గురువారం తాజాగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో మరో చిరుత చిక్కింది. దీంతో, బోనులకు చిక్కిన చిరుతల సంఖ్య ఐదుకు చేరింది. రెండు నడక మార్గాల్లో 500 ట్రాప్ కెమెరాలతో మానిటరింగ్ చేస్తున్నారు. చిరుతల కదలికపై ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నారు. చిరుతల భయాందోళన నేపథ్యంలో నడక మార్గంలో ఆంక్షలు అమలు చేస్తున్నారు. సెక్యూరిటీని పెంచడం, భక్తులకు చేతి కర్రలు ఇచ్చి పంపడం వంటి చర్యలు చేపట్టారు.

కంచె ఏర్పాటు ఎక్కడివరకంటే...

అలిపిరి నడక దారిలో 7.2 కిలోమీటర్ల పొడవున 3,550 మెట్లు వరకూ, మరోవైపు 2.1 కిలోమీటర్ల పొడవున 2,650 మెట్లు ఉన్న శ్రీవారి మెట్టు వరకూ ఇరువైపులా ఇనుక కంచె ఏర్పాటుకు టిటిడి రంగం సిద్ధం చేసింది. టిటిడి ఫారెస్ట్ పరిధి కేవలం ఎనిమిది వేల ఎకరాలలోపే ఉండగా, అందులోనే రెండు నడక మార్గాలు ఉన్నాయి. టిటిడి నడక మార్గాల్లో ఇనుప కంచె నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రతిపాదనలు పంపామని, కేంద్ర వైల్డ్‌లైఫ్ నుంచి అనుమతి వచ్చాక టిటిడి నిధులతో ఇనుప కంచెను డిజైన్లతో ఏర్పాటు చేయనున్నామని అటవీ శాఖాధికారి ఒకరు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

చిక్కిన మరో చిరుత

- యాత్రికుల భద్రత విషయంలో రాజీపడం : టిటిడి చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిరుతను పరిశీలిస్తున్న టిటిడి చైర్మన్

తిరుమల మొదటి ఘాట్ రోడ్డు ఏడవ మైలు వద్ద శ్రీ నరసింహస్వామి ఆలయం సమీపంలో మరో చిరుత చిక్కింది. దీంతో మొత్తం ఐదు చిరుతలను అటవీ అధికారులు బంధించారు. చిరుతను టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో బుధవారం అర్ధరాత్రి 12-1.00 గంట మధ్యలో చిరుత చిక్కిందన్నారు. రెండు నెలల్లో సుమారు ఐదు చిరుతలను బంధించామని తెలిపారు. అటవీశాఖ అధికారుల సహకారంతో దాదాపు 300 మంది అటవీ సిబ్బంది నిరంతర పర్యవేక్షణలో ఆపరేషన్ చిరుత కొనసాగుతుందన్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో వెళ్లే యాత్రికులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, యాత్రికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. చైర్మన్ వెంట జెఇఒ వీరబ్రహ్మం, టిటిడి డిఎఫ్ఒ శ్రీనివాసులు, అటవీశాఖ డిఎఫ్ఒ సతీష్ రెడ్డి, విజిఒ బాలిరెడ్డి, ఎవిఎస్ఒ సతీష్ ఉన్నారు

తన కుమార్తె వివాహం జరిపిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ఎమ్మెల్యే కుమార్తె కులాంతర వివాహం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రేమించిన వ్యక్తితో తన కుమార్తెకు కడప జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కులాంతర వివాహం జరిపించారు. పట్టణానికి చెందిన పవన్ కుమార్‌ను తన పెద్ద కుమార్తె పల్లవి ప్రేమించిందని తెలుసుకొని ఆయన తల్లిదండ్రులతో చర్చించి గురువారం ఉదయం బొల్లవరం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వివాహం జరిపించారు. అనంతరం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ.. ప్రేమించిన అబ్బాయితో తన కుమార్తెకు వివాహం జరిపించడం సంతోషంగా ఉందన్నారు. చదువుకుంటున్న సమయంలోనే తన కుమార్తె ఒక అబ్బాయిని ప్రేమిస్తే వారి స్థాయి, కుల మతాలు చూడకుండా తన కుమార్తె తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తూ వారిద్దరికీ వివాహం జరిపించానని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు కుటుంబ సభ్యులు కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు
నెం. 96 నుండి 104/23-24, తేది: 5-09-2023
పని పేరు: కృష్ణా పశ్చిమ డెల్టాలోని కాలువల మరమ్మత్తుల నిమిత్తం ఓ అండ్ యమ్ మరియు యమ్.పి.ల్యాడ్స్ పనులు చేపట్టుట. 9 పనుల విలువ: రూ. 61.61లక్షలు. టెండరు షెడ్యూల్స్ ఆన్‌లైన్‌లో లభ్యమగు తేది: 11.09.2023, ఉ. 10.30గం. నుండి 25.09.2023, ఉ. 11గం. వరకు. వివరాలు: https://tender.apeprocurement.gov.in ఫోన్.7901093255.
సం/-కార్యనిర్వాహక ఇంజనీరు, కృష్ణా పశ్చిమ భాగము, తెనాలి
DIPRNo.10839/CL/ADVT/1/1/2021-22

వైసిపి అరాచకాలపై పోరాటం : ఎమ్మెల్సీ అనూరాధ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ఎన్ని దాడులు చేసినా టిడిపి భయపడదని ఆ పార్టీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెదిరింపులకు భయపడేది లేదని, పోరాటం చేస్తామని చెప్పారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో మానవ హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్‌పై దాడి చేశారని పేర్కొన్నారు. శాసన మండలిలో చైర్మన్‌పై వైసిపి మంత్రులే దాడికి యత్నించారని తెలిపారు. నాలుగేళ్ల నుంచి ఎస్‌సి, ఎస్‌టి, బిసిలపై దాడులు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలు నిత్యకృత్యమయ్యాయని, ప్రజలు జీవచ్ఛవాల్లా బతుకుతున్నారని అన్నారు. వైసిపి అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలను కాపాడేందుకు లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని వివరించారు.

నిబంధనలకు విరుద్ధంగా ఓటు దరఖాస్తులు : రామాంజనేయులు

ఓటర్ల జాబితా పరిశీలనలో ఓటర్ల నుంచి వచ్చే ఫామ్-6, 7, 8, 9 దరఖాస్తుల సమాచారాన్ని అధికార పార్టీ దాచేస్తోందని టిడిపి నేత బి రామాంజనేయులు విమర్శించారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బూత్ నెంబర్లు, బిఎల్ఒల సమాచారం లేకుండా కేవలం ఇంటి చిరునామాలతో కూడిన దరఖాస్తులపై ప్రతిపక్ష పార్టీలు ఎలా విచారిస్తాయని ప్రశ్నించారు. విఆర్ఒలు రాజకీయ పార్టీలకు ఇచ్చే ఓటర్ల జాబితాల్లో ఫామ్-6 దరఖాస్తుల్లో ఏ బూత్ నుంచి ఏ బిఎల్ఒ ద్వారా కొత్త ఓటర్ ఓటుకు దరఖాస్తు చేసుకున్నారనే సమాచారం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం దొంగ ఓట్లు చేర్చడం, టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగించడంపై ఎక్కువగా దృష్టిపెట్టినట్లు అర్థమవుతోందని విమర్శించారు. రాష్ట్రంలో 3,99,88,000 ఓట్లు ఉంటే 45,951 మంది బిఎల్ఒలు ఉన్నారని తెలిపారు. ఒక నియోజకవర్గంలో సుమారు 300 మంది బిఎల్ఒలు ఉంటారని, వారి పేర్లు, ఫోన్ నెంబర్లు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలవారు వారితో సంప్రదించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

రైల్వే మేనేజర్ సహా ఆరుగురిపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి-కడప

కడప రైల్వేస్టేషన్ సమీపంలోని భాకరాపేట వద్ద మంగళవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటనకు సంబంధించి కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డి.నరసింహారెడ్డితో సహా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ లాల్‌బాబుసింగ్, సీనియర్ జిటిఎం ఖాసీం, పాయింట్స్ మెన్ జ్యోతి ప్రతాప్, పాయింట్స్ ఉమెన్ శాంతిని బుధవారం సస్పెండ్ చేసి అదేరోజు రాత్రి వారిపై సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. భాకరాపేట వద్ద చోటు చేసుకున్న ఘటనపై విచారణ నిమిత్తం కమిటీ వేసినట్లు తెలుస్తోంది. కమిటీ విచారణలో దోషులుగా తేలిన వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

పట్టాలు తప్పిన ప్రాంతాన్ని పరిశీలించిన డిఆర్ఎం

గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ప్రాంతాన్ని, గూడ్స్ బ్రేక్ వ్యాన్, డెమో ప్రాంతాలను గురువారం గుంతకల్ డిఆర్ఎం మనీష్ అగర్వాల్ సందర్శించారు. సీనియర్ సెక్షన్ ఇంజనీర్ విద్యుత్ కార్యాలయాన్ని, అధికారుల విశ్రాంతి గృహాన్ని, రైల్వే గూడ్స్ ఆఫీసును ఆయన తనిఖీ చేశారు. గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట సీనియర్ డిఒఎం జి.శ్రావణ్ కుమార్, సీనియర్ డిఇఎన్(కో-ఆర్డినేషన్) అక్కిరెడ్డి, సీనియర్ డిఇఎన్ (సౌత్) అభిరామ్, ఎడిఇ ఎన్.రాధాకృష్ణ, ఎఎస్‌టిఇ కాత్య కుమార్, ఎస్ఎంఆర్‌డి ఎన్‌రెడ్డి, సిసిఐ ఎ.జనార్ధన్, సీనియర్ డిఎస్‌టిఇ వై.పి.సింగ్ ఉన్నారు.

రూపాయి డీలా..

- డాలర్‌తో పోల్చితే 83.22కు పతనం

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో వరుసగా నాలుగో రోజూ భారత రూపాయి విలువ పడిపోయింది. గురువారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 9 పైసలు పతనమై ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా 83.22 కనిష్ట స్థాయికి దిగజారింది. డాలర్‌కు డిమాండ్ పెరగడంతో పాటుగా, పెరిగిన ముడి చమురు ధరల వల్ల రూపాయి విలువ మరింత ఒత్తిడికి గురైయ్యింది. దీంతో వరుసగా నాలుగో రోజూ నేల చూపులు చూసినట్లయ్యింది. చమురు ఉత్పత్తి దేశాలు ఈ ఏడాది డిసెంబరు వరకు సరఫరా కోతను పొడగించాలని భావించడంతో.. ముడి చమురు బ్యారెల్ 90 డాలర్లకు చేరింది. ఈ పరిణామంతో ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకం వద్ద డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ 83.15 వద్ద ప్రారంభం కాగా.. తుదకు ఇంతక్రితం రోజు ముగింపుతో పోల్చితే 9 పైసల పతనాన్ని నమోదు చేసింది. బుధవారం 9 పైసలు కోల్పోయి 83.13 వద్ద ముగిసింది. ఇంతక్రితం ఆగస్టు 21న భారత కరెన్సీ అత్యల్పంగా 83.13 వద్ద నమోదయ్యింది.

శాకాహారులపై టమాటా దెబ్బ

- ప్లేట్ ధర 24% ప్రియం
- క్రిసిల్ రిపోర్ట్

న్యూఢిల్లీ : దేశంలో ఓ దశలో మూడంకెల స్థాయికి పెరిగిన కిలో టమాటా ధర శాకాహారుల భోజనంపై తీవ్ర ప్రభావం చూపిందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ పేర్కొంది. 2022 ఆగస్టుతో పోల్చితే గడిచిన నెలలో సగటు భారతీయ కుటుంబంలో శాకాహారం థాలీ (ప్లేట్) ధర 24 శాతం పెరిగిందని క్రిసిల్ విడుదల చేసిన నెలవారీ రోటీ రైస్ రేట్ నివేదికలో తెలిపింది. 2023-24లో కూరగాయల భోజనం ధర పెరగడం ఇది రెండోసారని పేర్కొంది. 24 శాతంలో 21 శాతం టమాటా ధరనే కారణమని తెలిపింది. గతేడాది కిలో ధర రూ.37గా ఉండగా.. ఈ ఏడాది 176 శాతం ఎగిసి రూ.100పైకి ఎగబాకిందని పేర్కొంది. వెజ్ థాలీలో రోటీ, కూరగాయలు (ఉల్లిపాయలు, టొమాటో మరియు బంగాళదుంపలు), బియ్యం, పప్పు, పెరుగు, సలాడ్ ఉంటాయి. దీని సగటు ధర ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ భారతదేశంలో ఉన్న ధరల ఆధారంగా లెక్కించింది. గడిచిన నెలలో మాంసహార ప్లేట్ ధర 13 శాతం పెరిగింది. కాగా.. సెప్టెంబర్‌లో తగ్గుతోన్న టమాటా ధరల వల్ల ప్లేట్ భోజనం ధర దిగిరావొచ్చని క్రిసిల్ పేర్కొంది.

DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Ground & 1st Floor, Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam – 530020

Case No. : O.A. 325/2022

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub rule (2A) of rule of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993
Union Bank of India (e-Andhra Bank)
Sri Nagar Colony Branch, Guntur District - 522002
VS
M/s. Favourite Flex

To
Def 1 : M/s. Favourite Flex, Prop : Sri Kasina Surya Prakash Reddy, S/o. Rama Krishna Reddy, D.No. 7-14-38, 6/2, Valliruvarithota, Guntur
Def 2 : Sri Kasina Surya Prakash Reddy, S/o. Rama Krishna Reddy, D.No. 25-16-48A, Opp. Tobacco Board, 12/3 Lane, Srinivasarao Thota, Guntur - 522004.
Def 3 : Smt. Shaik Sabeeha Bhanu, W/o. Sri Kasina Surya Prakash, Door No. 25-16-48A, Opp. Tobacco Board, 12/3 Lane, Srinivasarao Thota, Guntur - 522004.

PAPER PUBLICATION

Whereas OA 325/2022 was listed before Hon'ble Presiding Officer / Registrar on 12-09-2023.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue Summons / notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs. 42,27,841-8 Ps (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted:
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application:
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties:
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal:
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before presiding Officer/ Registrar on 12-09-2023 at 10.30 A.M. failing the application shall be heard and decided in your absence.
Given under my hand and seal of this Tribunal on this date 06/09/2023
Signature of the Officer
Authorised to issue Paper Publication

విసి ఛాంబర్ ఎదుట నిరసన తెలుపుతున్న బోధనేతర సిబ్బంది

జీతాల కోసం రోడ్డెక్కిన బోధనేతర సిబ్బంది

'ద్రవిడ' విసి ఛాంబర్ ఎదుట నిరసన

ప్రజాశక్తి - గుడిపల్లి (చిత్తూరు జిల్లా)

తమకు జీతాలు ఇప్పించాలని ద్రవిడ విశ్వవిద్యాలయం విసి ఛాంబర్‌ను గురువారం బోధనేతర సిబ్బంది ముట్టడించారు. నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, తక్షణమే తమ జీతాలు చెల్లించాలని శాంతియుత నిరసన తెలిపారు. నాలుగు నెలల నుండి రావాల్సిన జీతభత్యాలను వెంటనే చెల్లించాలని, లేకుంటే మా కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల కోసం సంవత్సర కాలం నుంచి ఆందోళనలు చేస్తూనే ఉన్నామని, తమ గోడు పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీకి వచ్చిన విసిని ముట్టడించగా ఆయన కారు దిగకుండానే వెనక్కివెళ్లిపోయారు. బకాయి జీతాలు చెల్లించేందుకు ప్రయత్నిస్తామని రిజిస్ట్రార్ చెప్పడంతో నిరసన విరమించారు.

ఎయిర్ టర్బో టెక్నాలజీతో చల్లదనంగా పాదరక్షలు

క్యాంపస్ యాక్టివ్‌వేర్ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రముఖ స్పోర్ట్స్, అథ్లెయిజర్ పాదరక్షల బ్రాండ్‌లో ఒక్కటైనా క్యాంపస్ యాక్టివ్‌వేర్ కొత్తగా ఎయిర్ టర్బో టెక్నాలజీతో ప్రత్యేక శ్రేణీ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఈ పాదరక్షల సాంకేతికతను భారతీయ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు పేర్కొంది. క్యాంపస్ ఎయిర్ టర్బోతో రోజంతా వినియోగదారుల పాదాలను చల్లగా, తాజాగా, సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపింది. షూ వెనుక భాగంలో ఇన్లెట్, అవుట్‌లెట్ పోర్ట్ ఉండటంతో గాలి ప్రసరణకు గేట్‌వే లా ఉంటుందని క్యాంపస్ యాక్టివ్‌వేర్ లిమిటెడ్ సిఎంఒ ప్రేరణా అగర్వాల్ తెలిపారు. క్యాంపస్ ఎయిర్ టర్బో శ్రేణీ ప్రారంభ ధర రూ.2,299గా నిర్ణయించింది.

అవార్డు అందుకుంటున్న మేయర్, కమిషనర్

స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరుకు మూడో ర్యాంకు

ప్రజాశక్తి-గుంటూరు

స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. కేంద్ర పర్యావరణ శాఖ, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్.క్యాప్) జాతీయ స్థాయిలో చేపట్టిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి ఈ అవార్డు దక్కింది. ఈ అవార్డును మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్ నుండి నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి అవార్డును గురువారం అందుకున్నారు. దక్షిణ భారతదేశంలో గుంటూరు నగరానికే ఈ అవార్డు రావడం విశేషం. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 131 నగరాలు పోటీపడ్డాయని, అందులో 10 లక్షలలోపు జనాభా కేటగిరీలో నగరానికి 3వ ర్యాంకు దక్కిందని తెలిపారు. పది లక్షలలోపు జనాభా కేటగిరీలో మొదటి స్థానంలో అమరావతి (మహారాష్ట్ర), రెండో స్థానంలో మోర్దాబాద్ (ఉత్తరప్రదేశ్) నిలిచాయన్నారు. గతంలో కూడా సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్థానాన్ని గుంటూరు నగరపాలక సంస్థ సాధించిందని తెలిపారు. త్వరలో పారిశుధ్య నిర్వహణపై స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సంయుక్తంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు. అవార్డు రావడంలో కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

www.bgrcorp.com
BGR ENERGY
బిజిఆర్ ఎనర్జీ సిస్టమ్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: ఎ-5, పన్నంగాడు ఇండస్ట్రియల్ ఎస్టేట్, రామాపురం పోస్ట్, సుళ్లూరుపేట తాలుకా, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-524401.
ఫోన్ : +91 44 27948249 ఇమెయిల్ : compliance@bgrenergy.com కార్పోరేట్ ఐడెంటిటీ నంబర్ : L40106AP1985PLC005318

నోటీసు

37వ వార్షిక సర్వసభ్య సమావేశం మరియు ఇ ఓటింగ్ సమాచార నోటసు

ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా బిజిఆర్ ఎనర్జీ సిస్టమ్స్ లిమిటెడ్ ("ది కంపెనీ") యొక్క 37వ వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం, 29 సెప్టెంబర్, 2023న మ..12.30గం.లకు (ఐఎస్‌టి) వీడియో కన్ఫరెన్స్ (విసి)/ఇతర ఆడియో విజువల్ మీన్స్ (ఒఎవిఎం) ద్వారా ఎజిఎం నోటీసులో పొందుపరిచిన విధంగా సదరు వ్యాపార లావాదేవీలు జరుగుటకు నిర్వహించబడును.

కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ మరియు సెక్యూరిటీలు మరియు ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా వార్షిక నివేదిక మరియు సమావేశాల నోటీసు యొక్క భౌతిక కాపీలను వాటాదారులకు వారి సంబంధిత సర్క్యులర్ల ద్వారా పంపవలసిన అవసరానికి సంబంధించి మినహాయింపులను మంజూరు చేసింది. ఈ విధంగా, కంపెనీ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదిక కొరకు లింక్‌తో పాటు 37 ఎజిఎమ్ నోటీసును సెప్టెంబర్ 7, 2023న ఎలక్ట్రానిక్ మోడ్ ద్వారా మాత్రమే కంపెనీ/రిజిస్ట్రార్‌తో నమోదు చేసుకున్న ఈ-మెయిల్ చిరునామాలను కలిగి ఉన్న సభ్యులు మరియు బదిలీ ఏజెంట్ ("ఆర్‌టిఏ")/ డిపాజిటరీ పార్టిసిపెంట్(లు) కు పంపింది.

37 ఎజిఎమ్ నోటీసుతో పాటు ఎఫ్‌వై 2022-23 వార్షిక నివేదికను కూడా కంపెనీ వెబ్‌సైట్ www.bgrcorp.com, నుండి సమాచారాన్ని పొందొచ్చు మరియు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, దీనిని బిఎస్ఇ లిమిటెడ్ వెబ్‌సైట్ (www.bseindia.com) లో కూడా సమాచారాన్ని పొందొచ్చు మరియు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వెబ్‌సైట్ (www.nseindia.com) అలాగే నేషనల్ సెక్యూరిటీస్ డిపోసిటరీ లిమిటెడ్ (www.evoting.nsdl.com) మీటింగ్ నోటీసులో సూచించిన విధంగా సభ్యులు విసి/ఓఎవిఎమ్ సౌకర్యం ద్వారా మాత్రమే ఎజిఎమ్‌కి హాజరు కావచ్చు మరియు పాల్గొనవచ్చు. కంపెనీ 37 ఎజిఎమ్‌కి వ్యక్తిగతంగా హాజరు కావడానికి మరియు పాల్గొనడానికి ఎటువంటి నిబంధనలు ఉండవని దయచేసి గమనించండి.

ఎజిఎమ్ సమయంలో మరియు అంతకు ముందు ఇ ఓటింగ్ కొరకు సూచన

రూల్ 20తో చదువబడే కంపెనీల (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 ప్రకారం కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 108, మరియు సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైయిర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 44 ఇతర వర్తించే నిబంధనలు ఎజిఎమ్‌లో లావాదేవీలు జరిపే వ్యాపారానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ పద్ధతిలో (ఎజిఎమ్‌కి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ లేదా ఎజిఎమ్ సమయంలో ఇ-ఓటింగ్) వారి ఓటు హక్కును వినియోగించుకునే సదుపాయాన్ని అందించడానికి కంపెనీ సంతోషిస్తుంది మరియు ఈ ప్రయోజనం కొరకు ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా ఓటింగ్‌ను సులభతరం చేయడానికి కంపెనీ ఎన్ఎస్‌డిఎల్‌ని నియమించింది.

కటాఫ్ తేదీ అంటే శుక్రవారం, 22 సెప్టెంబర్, 2023 నాటికి డిపాజిటరీలు నిర్వహించే సభ్యుల రిజిస్టర్ లేదా బెనిఫిషియల్ ఓనర్స్ రిజిస్టర్‌లో పేరు నమోదు చేయబడిన వ్యక్తి రిమోట్ ఇ-ఓటింగ్ సదుపాయాన్ని పొందేందుకు ఎజిఎమ్‌కి ముందు లేదా ఎజిఎమ్ సమయంలో ఇ-ఓటింగ్ మాత్రమే అర్హులు. రిమోట్ ఇ ఓటింగ్ ప్రారంభ వ్యవధి మంగళవారం, 26 సెప్టెంబర్, 2023, ఉ.9.00గం. (ఐఎస్‌టి) మరియు ముగింపు మంగళవారం, 28 సెప్టెంబర్, 2023, సా.5.00 గం.(ఐఎస్‌టి). రిమోట్ ఇ ఓటింగ్ మాడ్యూల్ ఆ తర్వాత ఓటింగ్ కొరకు ఎన్ఎస్‌డిఎల్ ద్వారా నిలిపివేయబడుతుంది. మీటింగ్ సమయంలో ఇ-ఓటింగ్ సౌకర్యం కూడా అందుబాటులోకి తీసుకురాబడుతుంది మరియు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేయని ఎజిఎమ్‌కి హాజరయ్యే సభ్యులు ఎజిఎమ్ సమయంలో ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేయడానికి అర్హులు.

ఎజిఎమ్‌కి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేయడానికి సభ్యుల ఓటింగ్ హక్కులు మరియు ఎజిఎమ్ సమయంలో ఇ-ఓటింగ్ కట్-ఆఫ్ తేదీ అంటే శుక్రవారం, 22 సెప్టెంబర్, 2023 నాటికి కంపెనీ యొక్క పెయిడ్-అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో వారి వాటాకు అనులోమానుపాతంలో ఉంటాయి.

ఎన్ఎస్‌డిఎల్ ఇ ఓటింగ్ సిస్టమ్ www.evoting.nsdl.com వద్ద విసి/ఓఎవిఎమ్ ద్వారా ఎజిఎమ్ కు హాజరు కాడానికి కంపెనీ సౌకర్యాన్ని కల్పిస్తోంది.
సమగ్ర మార్గదర్శకత్వం ఎ) మీటింగ్‌కి ముందు రిమోట్ ఇ ఓటింగ్ బి) విసి/ఓఎవిఎమ్ ద్వారా మీటింగ్ లో చేరడం మరియు పాల్గొనడం, సి) సమావేశంలో ఇ ఓటింగ్ డి) ఇ-మెయిల్ చిరునామాల నమోదు ఎజిఎమ్ నోటీసులో అందుబాటులో ఉంది. కంపెనీ వెబ్‌సైట్ www.bgrcorp.com లో యాక్సెస్ చేయవచ్చు మరియు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
శ్రీ.ఆర్.శ్రీధరన్ మరియు అసోసియేట్స్, ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీలు నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా ఇ-ఓటింగ్ ప్రక్రియను (సమావేశానికి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ మరియు మీటింగ్ సమయంలో ఇ-ఓటింగ్) పరిశీలించడానికి స్క్రూటినైజర్‌గా నియమించబడ్డారు.

కంపెనీ/డిపితో ఇ-మెయిల్ చిరునామాల నమోదు మరియు ఇ-ఓటింగ్ కోసం వినియోగదారు ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందడం

ఫిజికల్ మోడ్‌లో షేర్‌లను కలిగి ఉన్న సభ్యులు మరియు కంపెనీతో తమ ఇ-మెయిల్ చిరునామాను అప్‌డేట్ చేయని వారు తమ ఇ-మెయిల్ చిరునామాలను కంపెనీ యొక్క ఇ-మెయిల్ చిరునామా investors@bgrenergy.com కు వ్రాయడం ద్వారా అప్‌డేట్ చేయాలని అభ్యర్థించారు. డీమెటీరియలైజ్డ్ మోడ్‌లో షేర్లను కలిగి ఉన్న సభ్యులు తమ ఇ-మెయిల్ చిరునామాలను సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్‌లతో రిజిస్టర్ చేసుకోవాలని/ నవీకరించాలని అభ్యర్థించారు.

ప్రత్యామ్నాయంగా, సభ్యులు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను స్వీకరించడానికి తాత్కాలిక ప్రాతిపదికన శుక్రవారం, 22 సెప్టెంబర్, 2023, సా.5.00 గం. ఐఎస్‌టి న లేదా అంతకు ముందు rnt.helpdesk@linkintime.co.in వద్ద వారికి వ్రాయడం ద్వారా ఆర్‌టిఎతో వారి ఇమెయిల్ చిరునామాలను నమోదు చేసుకోవచ్చు.
భౌతిక రూపంలో వాటాలను కలిగి ఉన్న మరియు వ్యక్తిగతేతర వాటాదారులు, ఈ నోటీసు పంపిన తర్వాత కంపెనీ వాటాలను పొంది మరియు కంపెనీలో సభ్యుడిగా మారిన మరియు కట్-ఆఫ్ తేదీ, అనగా.. శుక్రవారం, 22 సెప్టెంబర్, 2023 నాటికి షేర్లను కలిగి ఉన్న వ్యక్తి, evoting@nsdl.co.in కి రిక్వెస్ట్ పంపడం ద్వారా ఇ ఓటింగ్ కొరకు పాస్‌వర్డ్ మరియు యూజర్ ఐడి ని పొందవచ్చు. డిసిఐడి-క్లయింట్ ఐడి అందించడం ద్వారా (16- డిజిట్ డిపిఐడి+క్లయింట్ ఐడి లేదా 16-డిజిట్ బెన్‌ఫిటరీ ఐడి) పేరు, క్లయింట్ మాస్టర్ లేదా కన్సోలిడేటెడ్ ఎకౌంట్ స్టేట్‌మెంట్ యొక్క కాపీ, పాన్ (పాన్ కార్డు స్వీయ ధృవీకరించబడి స్కాన్ చేసిన కాపీ), ఆధార్ (ఆధార్ కార్డ్ యొక్క స్వీయ-ధృవీకరించబడిన స్కాన్ చేసిన కాపీ) ఇ-ఓటింగ్ కోసం వినియోగదారు ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందడం/పొందడం కోసం ఇతర పద్ధతులు ఎజిఎమ్ నోటీసులో అందించబడ్డాయి.

ఇ-ఓటింగ్ లేదా విసి/ఓఎవిఎమ్ ద్వారా మీటింగ్‌లో చేరడం గురించి ఏవైనా సందేహాలు ఉంటే, మీరు డౌన్‌లోడ్ విభాగంలో www.evoting.nsdl.com అందుబాటులో ఉన్న షేర్‌హోల్డర్‌ల కొరకు తరచుగా అడిగే ప్రశ్నలు (ఎఫ్ఎక్యూలు) మరియు షేర్‌హోల్డర్‌ల కొరకు ఇ-ఓటింగ్ యూజర్ మాన్యువల్‌ని చూడవచ్చు. ప్రత్యామ్నాయంగా, ఎన్ఎస్‌డిఎల్ 022-4886 7000 లేదా 022-2499 7000 వద్ద మీరు సంప్రదించగలరు లేదా evoting@nsdl.co.in వద్ద అభ్యర్థనను పంపగలరు.

బిజిఆర్ ఎనర్జీ సిస్టమ్స్ లిమిటెడ్
సం/-
ఎస్.కృష్ణ కుమార్
ప్రెసిడెంట్ అండ్ కంపెనీ సెక్రటరీ
ప్రదేశం : చెన్నై
తేది : 7 సెప్టెంబర్, 2023

ఆఫ్ బడ్జెట్ భారమే

- రెండేళ్లలో అసలు, వడ్డీకే 23 వేలకోట్లు
- లెక్కలు తేల్చిన అక్కౌంటెంట్ జనరల్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో బడ్జెటేతర రుణాల భారం గణనీయంగా పెరుగుతోంది. తీసుకున్న రుణాలకు చెల్లించాల్సిన అసలు, వడ్డీల భారం వేల కోట్లలో ఉండడంతో ఆర్థికశాఖ తలలు పట్టుకుంటోంది. తాజాగా ప్రధాన అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం విడుదల చేసిన ఒక నివేదికలోని అంశాలు ఆందోళనకరంగానే ఉంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇటువంటి చెల్లింపుల కోసమే మరికొన్ని అప్పులు కూడా చేయాల్సి వస్తోందని వారంటున్నారు. 2023 మార్చి 31 నాటికి తేలిన లెక్కల మేరకు రాష్ట్ర ఆఫ్ బడ్జెట్ రుణాలు 1,36,070 కోట్లుగా అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం గుర్తించింది. ఇందులో అత్యధికంగా పౌరసరఫరాల శాఖ ద్వారానే ఏకంగా 35,100 కోట్లు రుణాలుగా సేకరించారు. రెండో స్థానంలో డిస్కామ్‌లు, మూడో స్థానంలో రాష్ట్రాభివృద్ధి సంస్థలు ఉన్నాయి. అయితే ఈ రుణ మొత్తాన్ని తీర్చేందుకు ఖజానా తీవ్రంగానే శ్రమించాల్సి వస్తోంది. గడచిన రెండేళ్లలో ఏకంగా 23 వేల కోట్ల వరకు అసలు, వడ్డీకి ఖర్చు చేయాల్సి వచ్చింది. 2021-22లో 7,214 కోట్లు, 2022-23లో 15,569 కోట్లు అసలు, వడ్డీల కింద చెల్లించినట్లు లెక్కలు తేలాయని పిఎజి పేర్కొంది. ఆఫ్ బడ్జెట్ రుణాలకు సంబంధించి గడచిన రెండేళ్లలో ఏకంగా 6,961 కోట్ల రూపాయలను అసలు, వడ్డీల కింద చెల్లించారు. ఇక రెండు ప్రధాన డిస్కామ్‌ల ద్వారా 37,880 కోట్లు రుణాలుగా సేకరించగా, అందుకు అసలు, వడ్డీల కింద 2,079 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. పౌర సరఫరాల శాఖ రుణాలపై 3,780 కోట్లు, టిడ్కో రుణాలపై 1500 కోట్లకుపైగా, చెల్లింపులు చేయగా, జలవనరుల అభివృద్ధి సంస్థ తీసుకున్న రుణాలపైనా 2,200 కోట్ల వరకు అసలు, వడ్డీలుగా చెల్లించారు. అలాగే మరో పది సంస్థల రుణాలపైనా వేల కోట్లు అసలు వడ్డీలుగా చెల్లించడంతోనే భారం పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఠ రాష్ట్ర ఆర్థికశాఖ ఆధీనంలోని సిఎఫ్ఎంఎస్‌కు సంబంధించిన ఓచర్లు, డేటా ఆధారంగానే ఈ ఆఫ్ బడ్జెట్ రుణాల వివరాలను సిద్ధంచేసినట్లు పిఎజి అధికారులు ప్రకటించడం విశేషం.

కొన్ని సంస్థల రుణాలపై అసలు, వడ్డీ వివరాలు (రూ.కోట్లలో)

సంస్థ	రుణం	2021-22 అసలు, వడ్డీ	2022-23 అసలు, వడ్డీ
సివిల్ సప్లయిస్	35,100	119	147
టిడ్కో	5,264	664	862
హౌసింగ్	3,547	---	475
జలవనరుల	8,684	1,029	1,171
ఎపిఆర్‌డిసి	3,387	571	857
ఎపిఎస్‌డిసి	21,450	3,220	3,741
డిస్కామ్‌లు	37,880	408	1,671
పవర్‌ఫైనాన్స్	12,388	219	2,422
మొత్తం	**1,36,070**	**7,219**	**15,549**

సంపాదకీయం

భయం.. భయం...

'ఎరుపంటే కొందరికీ భయం.. భయం...' అన్నాడో విప్లవ కవి. కాని ఇపుడు కేంద్రంలోని బిజెపి పాలకుల తీరు చూస్తే 'ఇండియా అంటేనే కొందరికి భయం భయం' అని రాసేవాడేమో! జీ-20 సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి భవన్ నుండి అతిథులకు పంపిన విందు ఆహ్వానాలలో ద్రౌపది ముర్మును 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా' అనకుండా 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని పేర్కొనడంతో ఇటువంటి అభిప్రాయాలు కలుగుతున్నాయి. నిన్న మొన్నటి దాకా ఇండియా వేదిక పేరుపైనే నానా యాగీ చేసిన బిజెపి ఇపుడు దేశం పేరునే మార్చేయజూస్తోందన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ దేశాన్ని భారత్ అనే పిలవాలని ఇటీవల చెప్పడం, ఇప్పుడీ ఆహ్వాన పత్రిక ముద్రించడంతో ఏకంగా దేశం పేరును కేంద్ర ప్రభుత్వం మారుస్తోందని అనేక కథనాలు వెలువడ్డాయి. గత నెలలో మోడీ గ్రీస్‌లో పర్యటించినప్పుడు ప్రొటోకాల్ సామగ్రిపై 'ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ భారత్' అని ముద్రించినట్లు, ఇకపై భారత్ అనే పదాన్నే ఉపయోగించాలని తమను మౌఖికంగా ఆదేశించారని సిబ్బంది తెలిపిన విషయం కూడా మీడియాలో వచ్చింది. ఇండియాకు బదులు భారత్ పేరును ప్రభుత్వం రెండవసారి ప్రస్తావించడంతో దానికి మరింత బలం చేకూరుతోంది.

దేశం పేరును భారత్‌గా మార్చాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు 2016లో కొట్టివేసింది. 2020లో ఇలాంటి పిటిషనే విచారణకు వచ్చినప్పుడు దానిని కూడా అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. "ఇండియా..అంటే భారత్.. రాష్ట్రాల సమాఖ్య" అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 చెబుతోంది. రాజ్యాంగం గుర్తించిన 'ఇండియా', 'భారత్' పదాలు రెండూ దేశానికి అధికారిక పేర్లే'నని పేర్కొంది. ఆ కేసుల్లో మోడీ సర్కారు తన అఫిడవిట్‌లో 'పిటిషన్‌లో పేర్కొన్న అంశాలను భారత రాజ్యాంగ సభలో సుదీర్ఘంగా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అందువల్ల భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 1లో ఎలాంటి మార్పునూ పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేద'ని చెప్పింది. మరి ఇప్పుడెందుకీ ప్రతిపాదన చేస్తోంది? ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానం రెండు సార్లు తిరస్కరించినప్పటికీ సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే పేరు మార్పునకు పూనుకోవడం కోర్టు ధిక్కారం కాదా? అంతేగాక భారత రాజ్యాంగసభ ఏకగ్రీవంగా చేసిన నిర్ణయాన్ని తిరగదోడాలనుకోవడం రాజ్యాంగ నిర్మాతలను, రాజ్యాంగాన్నీ అవమాన పరిచే ప్రయత్నమే కదా! వివిధ పథకాలకు 'మేకిన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' వంటి పేర్లు పెట్టిన కేంద్ర ప్రభుత్వం దేశం పేరులోనే ఇండియా లేకుండా చేయాలని హఠాత్తుగా యోచిస్తోంది. కాబట్టి ఇండియా పేరంటేనే మోడీ సర్కారుకు భయం కలుగుతోందన్నది నిర్వివాదాంశం.

మనకు రాజ్యాంగం ఉంది. శతాబ్దాలుగా దేశం ఎలా ప్రసిద్ధి చెందిందో అందరికీ తెలుసు. మన స్వతంత్ర భారతదేశాన్ని మనం వారసత్వంగా పొందాము. రాజ్యాంగంలోని మొదటి ఆర్టికల్‌లో 'ఇండియా అంటే భారత్ రాష్ట్రాల యూనియన్' అని స్పష్టంగా పేర్కొంది. వైవిధ్యం, బహుళత్వం, ఇలా ప్రతిదీ రాజ్యాంగంలో చేర్చబడింది. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), ఐఐటిలు, ఐఐఎం వంటి పేర్లలో కూడా "ఇండియా" అనే పదం ఉంది. ఇప్పటి వరకు ప్రెసిడెంట్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండియా అని ఉండగా దాన్ని ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అంటే ఈ దేశం ఒక రిపబ్లిక్‌గా ఉండడం బిజెపి కి ఇష్టం లేదా? ఇండో-పసిఫిక్ అని ఉంది. దాన్ని మార్చేయగలరా? ఇటువంటి ప్రశ్నలెన్నో! ఈ విధమైన ప్రయత్నాలు భారత రాజ్యాంగ విధ్వంసానికి దారి తీస్తాయి. పాలకులు వేసే ఏ రాజకీయ ఎత్తుగడ కూడా దేశానికి వ్యతిరేకంగా ఉండకూడదు. అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమైన దేశం పేరు మార్చే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలి. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ వైవిధ్యాన్ని నాశనం చేసే బిజెపి ప్రయత్నాలను దేశంలోని ప్రజాస్వామ్య శక్తులన్నీ ప్రతిఘటించాలి. భారత రాజ్యాంగాన్ని, దాని మౌలిక స్వభావాన్ని కాపాడుకోవాలి.

మహనీయుల మాట

పెట్టుబడిదారీ విధానానికి నైతిక విలువలు, నీతినియమాలు లేవు. ప్రతీదీ అమ్మకం కోసమే.

- ఫైడల్ కాస్ట్రో

మనకిప్పుడు మతాల్ని ప్రశ్నించే గొంతుకలు కావాలి!

కామన్‌సెన్స్

కొన్ని పార్టీలు దేశంలో హిందూ ముస్లిం మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇప్పుడు దేశానికి ప్రశ్నించే గొంతుకలు కావాలి. కానీ, ప్రశ్నించే వారిని ఏ తప్పూ లేకపోయినా ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తూ ఉంది. ఈ స్థితిలో దేశాన్ని చూస్తుంటే భయమేస్తోంది.

- అమర్త్య సేన్, ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ పురస్కార్ గ్రహీత.

డా|| దేవరాజు మహారాజు

ఇటీవల ఇండియా కూటమి పార్లమెంట్‌లో బిజెపి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. ఎందుకూ? ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కాదు, పార్లమెంటుకు ముఖం చాటేసి, పారిపోయే దేశ ప్రధానిని పార్లమెంట్‌కు రప్పించి, మణిపూర్‌పై మాట్లాడించడానికి! అది విజయవంతమైంది. అంటే బిజెపి ప్రతిభ తగ్గిందని అర్థం. కాంగ్రెస్ ముఖ్యనేత ఎంపీగా అనర్హుడని ఇంటికి పంపారు. కానీ ఆయన సుప్రీంకోర్టు ఆర్డర్‌తో పార్లమెంట్‌కు వచ్చి కూర్చున్నారు. అంతేకాదు, 'రాహుల్ గాంధీ మాట్లాడాలి' అని బిజెపి ఎంపీలతోనే బతిమిలాడించుకున్నాడు - అంటే ఏమిటీ? కాంగ్రెస్ ప్రభ తగ్గినట్టా? బిజెపి ప్రభ తగ్గినట్టా? ప్రతిపక్షాల ప్రభ తగ్గినట్టా. "మణిపూర్‌లో భారతమాతను హత్య చేశారు. మీ కుట్రలు, కుతంత్రాలతో మణిపూర్‌ను రెండుగా చీల్చారు" అని కాంగ్రెస్ నేత ఆక్రోశిస్తూ చెప్పిన మాటల్లోని ఆవేదన ఈ దేశ ప్రజల మనసుల్లో తిష్టవేసింది. బిజెపి మంత్రులు, హోంమంత్రి, దేశ ప్రధాని గంటల తరబడి చెప్పిన అసందర్భపు మాటలు, తక్కువ స్థాయి హాస్యోక్తులు ప్రతిపక్షాలు వినదల్చుకోలేదు. అందుకే వాకౌట్ చేశారు. ప్రతిపక్షాల ఐక్యత మనకు అక్కడ కనిపించింది. పనికిరాని విషయాన్ని రాద్ధాంతం చేసిన బిజెపి మహిళా మంత్రుల మాటలు గానీ, దేశ ప్రధాని ఇండియా కూటమిపై పేల్చిన జోకులు గానీ వారి స్థాయిని నిలుపలేకపోయాయి. పైగా కనపడని అగాధంలోకి పడదోశాయి.

నిర్భయ అనే ఒక మహిళని సామూహికంగా అత్యాచారం చేసినందుకు నిరసనగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో దేశ ప్రధానికి గాజులు పంపారు ఒక విపక్ష సభ్యురాలు! ఆమె ఇప్పుడు మంత్రిగా అధికారంలో ఉన్నారు. మరి ఇప్పుడు తమ స్వంత ప్రధానికి ఒక గాజుల దుకాణమే పంపాలి కదా? ఎందుకంటే మణిపూర్‌లో ఇప్పుడు ఒక్క మహిళ కాదు, అనేక వందల మంది మహిళలు సామూహిక అత్యాచారాలకు గురయ్యారు. మహిళల్ని నగ్నంగా వీధుల్లో ఊరేగించారు. ఈ విషయాలు స్వయంగా మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రే ప్రకటించారు. అధికారంలో ఉన్న బిజెపి మహిళా మంత్రులకు ఈ విషయాలు కనబడలేదు. కనీసం నిరసన - ఒక సానుభూతి ప్రకటన కూడా లేదు. నిర్భయ విషయం బయటి ప్రపంచానికి తెలియకుండా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం అడ్డుకోలేదు. ఇప్పుడు మాత్రం ఈ రాష్ట్ర - కేంద్ర బిజెపి ప్రభుత్వాలు ఇంటర్నెట్ సేవలు ఆపేసి విషయాలు బయటి ప్రపంచానికి తెలియకుండా చేశాయి. అధికారంలో ఉన్న మహిళా మంత్రులు, ఎంపీలు ఏం చేస్తున్నట్టూ? మహిళల పక్షాన గొంతెత్తరా? మానవీయ విలువల్ని తొక్కిపెట్టే రాజకీయాలు ఇంత నీచంగా ఉంటాయా?

అర్ధనగ్నంగా ఓ మహిళ - పోలీసుల మీద తిరగబడుతున్నట్లుగా ఉన్న ఓ వీడియో మీడియాలో తిరిగింది. "మణిపూర్ పోలీసుల మీద కుకీ మహిళ దాడి చేస్తున్నట్లు - కాషాయ వర్గాలు దాన్ని వక్రీకరించి విష ప్రచారం ప్రారంభించాయి. అది వాస్తవం కాదు. ఆ వీడియో ఉత్తరప్రదేశ్ చందౌలీ లోని పండిట్ దీన్‌దయాళ్ నగర్‌లో మున్సిపల్ ఎన్నికల సందర్భంలో జరిగిన ఘటన - ఓట్లను తిరిగి లెక్కించాలని డిమాండ్ చేస్తూ సోనూ కిన్నార్ అనే స్వతంత్ర అభ్యర్థి మద్దతుదారులు కౌంటింగ్ కేంద్రం వెలుపల గుమిగూడి పోలీసులతో వాగ్వాదానికి దిగారు - అది అప్పటి వీడియో. దానికీ మణిపూర్ కుకీ మహిళలకీ సంబంధమే లేదు. అధికారంలో ఉన్నవారు అబద్ధాల ప్రచారానికి 3 వేల మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో ఒక ఐటీ సెల్ నడుపుతున్నారు. అది చేసే పని ఇదే. రోజుకు లక్షల మందికి తప్పుడు సందేశాలు, మార్ఫింగ్ చేసిన వీడియోలు పంపడమే వీరి విధి. ఏ ప్రధాని ఉన్నప్పుడైనా నాబోటి సామాన్యుడికి పి.యం.ఓ. (ప్రైమ్ మినిస్టర్స్ ఆఫీస్) నుండి ఈమెయిళ్లు వచ్చేవి కావు. ఇప్పుడు మాత్రం నెలకు 3, 4 వస్తూనే ఉంటాయి. మెయిల్ బాక్స్ నిండిపోకుండా, డిలిట్ చేసుకోవడం అదనంగా మనకు పనిభారం! మణిపూర్ ఘటనలో ప్రధాన నిందితుడు అబ్దుల్ ఖాన్ అరెస్టయ్యాడని అబద్ధాల ఐటీ సెల్ ప్రచారం చేసింది. అసలు నిందితుడు హేయ్‌రిమ్ హిరోదాస్ మెయితీ. అసలు పేరు దాచిపెట్టి, తప్పును ముస్లింలపైకి తోసెయ్యడానికి ప్రయత్నం జరిగిందని తెలిసిపోయింది.

ఈ దేశంలోని సామాన్యులు దేశ నాయకులందరినీ గమనిస్తున్నారు. అర్థం చేసుకుంటున్నారు. మణిపూర్ తగలబడుతోందన్న బాధ లేకుండా, అధికారంలో ఉండి, తక్షణం చేపట్టాల్సిన చర్యలు చేపట్టకుండా విపక్షాల మీద వ్యంగ్యాస్త్రాలు సంధించడానికి కాదు గదా ఈ దేశ ప్రజలు బిజెపికి అధికారమిచ్చిందీ? ఎవరు అధికారమిచ్చారో వారే సమయం చూసి మళ్ళీ లాగేసుకుంటారు. బలం ఉందన్న అహంకారం అన్ని వేళలా, అన్ని చోట్లా పనిచేయదు. 'ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక కార్యక్రమాన్ని శత్రువులు నేరాలతోనూ బలప్రయోగంతోనూ అణిచివేయలేరు. ప్రజలే చరిత్ర నిర్మాతలు' అన్నారు సాల్వడార్ అలెండీ.

"ప్రధాని మోడీ మమ్మల్ని ఏ విధంగా పిలిచినా, ఏ విధంగా గేలి చేసినా మేము - 'ఇండియా'నే. మణిపూర్ గాయాలు మాన్పడానికి మేం సహాయ పడతాం. మణిపూర్ మహిళల, చిన్నారుల కన్నీళ్ళు తుడుస్తాం. మేం మణిపూర్ ప్రజల జీవితంలో ప్రేమను, శాంతిని తిరిగి తీసుకొస్తాం!" అన్నారు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇండియా కూటమి పక్షాన. ఈ దేశంలోని సామాన్యులు దేశ నాయకులందరినీ గమనిస్తున్నారు. అర్థం చేసుకుంటున్నారు. మణిపూర్ తగలబడుతోందన్న బాధ లేకుండా, అధికారంలో ఉండి, తక్షణం చేపట్టాల్సిన చర్యలు చేపట్టకుండా విపక్షాల మీద వ్యంగ్యాస్త్రాలు సంధించడానికి కాదు గదా ఈ దేశ ప్రజలు బిజెపికి అధికారమిచ్చిందీ? ఎవరు అధికారమిచ్చారో వారే సమయం చూసి మళ్ళీ లాగేసుకుంటారు. బలం ఉందన్న అహంకారం అన్ని వేళలా, అన్ని చోట్లా పనిచేయదు. "ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక కార్యక్రమాన్ని శత్రువులు నేరాలతోనూ బలప్రయోగంతోనూ అణిచివేయలేరు. ప్రజలే చరిత్ర నిర్మాతలు" అన్నారు సాల్వడార్ అలెండీ. అమెరికా కుట్రదారులకు బలైన చిలీ అధ్యక్షుడు - కమ్యూనిస్టు నేత.

దేశ కాల పరిస్థితుల్ని సునిశితంగా పరిశీలించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ డాక్టర్ రఘురామ్ రాజన్ ట్విట్టర్‌లో ఇలా రాశారు. అందులోని నిజానిజాల్ని మనం కూడా బేరీజు వేసుకోవాలి. ఆయన ఆలోచనల్ని, ఆవేదనల్ని ఈ దేశ ప్రజలు తప్పక అర్థం చేసుకోవాలి. ఆలోచించాలి.

భారతదేశం రకరకాల పూలతో అల్లిన పూలమాల! కానీ, అది ప్రస్తుతం ఒక కోతి చేతికి చిక్కింది. నేను కాంగ్రెస్ వాడినో, కమ్యూనిస్టునో, మోడీ భక్తుణ్ణో కాదు. నా భారతదేశాన్ని ప్రేమించే ఒక సాధారణ పౌరుణ్ణి! గత 70 ఏళ్లుగా కుల మతాలకు అతీతంగా దేశం ఎంతో అభివృద్ధి సాధించింది. అందుకు భారత ప్రధానులందరూ అహోరాత్రులు శ్రమించారు. ఫలితంగా నేడు మన దేశం ప్రపంచంలో గొప్ప శక్తిగా ఎదిగింది. ఇక్కడ కొన్ని వాస్తవాల్ని విశ్లేషించుకుందాం!

❖ మోడీ పుట్టక ముందే పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో భారత్ విజయం సాధించింది. ❖ మోడీకి మాటలు రాకముందే ప్రపంచంలో అత్యుత్తమ రాజ్యాంగం భారతదేశానికి సమకూరింది. ❖ మోడీ బాజ్రా, కోలం వంటి ఆటలు ఆడే నాటికి భారతదేశం భాక్రానంగల్ నిర్మించుకుంది. ❖మోడీ అక్షరాలు రాయడం నేర్చుకోకముందే ఇక్కడ ఎఐఐఎమ్‌ఎస్/ఐఐటి ఇంకా అనేక ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాలు ప్రారంభించబడ్డాయి. ❖ మోడీ రైల్వేస్టేషన్‌లో టీ అమ్ముకుని బతికే నాటికి ఇక్కడ రాజధాని ఎక్స్‌ప్రెస్ లాంటి వేగంగా నడిచే రైళ్ళు పరిగెత్తాయి. ❖ ఈ దేశానికి ఎన్ని ప్రయోజనాలు సమకూరాయో అన్ని ప్రయోజనాలు మోడీ గుజరాత్ సీఎం కాకముందే సమకూరాయి.

మోడీ ప్రధాని అయిన తర్వాతే దేశానికి అన్నీ సమకూరాయనీ, అదంతా ఆయన పరిపాలనా దక్షత అని కొందరు జనాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. వ్యక్తిగతంగా వారు నమ్మినా, నమ్మకపోయినా జనాన్ని పిచ్చివాళ్ళను చేయడానికి నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి మోడీ ప్రధాని అయిన నాలుగేళ్ళలో దేశాన్ని నలభై యేళ్ల వెనక్కి నడిపించారు. కుల, మత రహిత సామరస్య భావనతో ఉన్న భారత దేశాన్ని మోడీ తన మతతత్వంతో ముక్కలు చేసే ప్రయత్నం చేశారు. ఈ దేశంలో మన పూర్వీకులు అనుభవించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు భవిష్యత్తులో మన పిల్లలు కూడా అనుభవించాలని మనం కోరుకుంటున్నాం! అంతే.

డాక్టర్ రఘురామ్ రాజన్ వెలిబుచ్చిన అభిప్రాయాలలో నిజం ఉందా లేదా? నిజాయితీ ఉందా లేదా? అనేది ఎవరికి వారు ఆలోచించుకోవాలి. బాధ్యత, విజ్ఞత గల పౌరులు తప్పకుండా డాక్టర్ రాజన్ అభిప్రాయాలతో ఏకీభవిస్తారు. సందేహం లేదు.

"సనాతన ధర్మం-క్రమశిక్షణ గల ధర్మం" అని చెప్పుకునే వారు గుజరాత్, మణిపూర్ మారణకాండలు క్రమశిక్షణతోనే చేయించారా? మన చంద్రయాన్-3 లక్షల కి.మీ. ప్రయాణించి విజయవంతంగా చంద్రుణ్ణి చేరింది పాపం! ఈ దేశ ప్రధాని మాత్రం ఢిల్లీ నుండి మణిపూర్ చేరుకోలేక విఫలమయ్యాడు. "మతాలన్నీ అంటువ్యాధుల వంటివి, వాటిని అరికట్టాలన్న" తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ గొంతుకు దేశంలో మద్దతు పెరిగింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లాక్కుని ప్రజల్ని విడదీసే మతాలన్నింటినీ ఆయన అన్నట్టు... త్యజించాల్సిందే! మనుషులందరిదీ ఒక్కటే స్థాయి అని నిరూపించిన జన్యుశాస్త్రాన్ని ఒప్పుకున్న ధర్మమే నిజమైన ధర్మం!! ఉట్టి స్వాతంత్ర్యమే కాదు, దానితో పాటు, ఈ దేశ ప్రజలకు స్వేచ్ఛ అవసరం! ప్రజాస్వామ్యం కూడా అవసరం! అందుకు నిత్య చైతన్యవంతంగా ప్రజా పోరాటాలు ఇంకా కొనసాగించాల్సే ఉంది. ఇంకా కొన్ని సాధించుకోవాల్సే ఉంది.

/ వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ /

'మంచి గతమున కొంచెమేనోయ్'

ఎం.వి.ఎస్. శర్మ

వ్యాఖ్య

మోడీ, ఆయన అనుచరులు వెనకేసుకొస్తున్నది ఈ పనికిమాలిన, కాలం చెల్లిన ధర్మాన్నే. 75 సంవత్సరాల క్రితమే, మన దేశ ప్రజలు తమకు ఏ ధర్మం కావాలో స్పష్టంగానే ఎంచుకున్నారు. సనాతన ధర్మాన్ని, కుల, మత, లైంగిక, వివక్షత అనాగరికం అని తేల్చి చెప్పేశారు. సతీ సహగమనం ఇప్పుడు నేరం. అంటరానితనాన్ని పాటిస్తే అది నేరం. బాల్య వివాహాలు నిషిద్ధం, స్త్రీల పట్ల అగౌరవంగా వ్యవహరిస్తే అది నేరమే. అంటే, స్వతంత్ర భారతదేశ ప్రజలు వివక్షతాపూర్వకమైన ఆ సనాతన ధర్మం తమకు అవసరం లేదని తేల్చి చెప్పేశారు. మరి మోడీ సైన్యానికి ఎందుకు సనాతన ధర్మం పట్ల ఆసక్తి?

'సనాతన ధర్మాన్ని కాపాడండి' అని స్వయానా ప్రధాని పిలుపునిచ్చారు. మన తెలుగు సినీ హీరోల కుటుంబ పరంపరలోని ఒక మగధీరుడు ఆ పిలుపుని అందుకుని సనాతన ధర్మ పరిరక్షణ చేయవలసిందిగా తెలుగు ప్రజలందరినీ కోరారు. మరోపక్క సనాతన ధర్మం పేర సాగుతున్న సామాజిక దురాచారాలను తుదముట్టించాలని ఉదయనిధి స్టాలిన్ పిలుపునిచ్చారు.

భేతాళ కథల్లో విక్రమార్కుడు భేతాళుడి ప్రశ్నకు సమాధానం తెలిసీ చెప్పకపోతే అతడి తల వెయ్యి ముక్కలౌతుందని భేతాళుడు షరతు పెట్టాడు. తనకు సమాధానం నిజంగానే తెలియదు గనక విక్రమార్కుడు మౌనం వహించాడు. తన తల ముక్కలు కాకుండా చూసుకున్నాడు. కాని మన రాష్ట్ర ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రులిద్దరూ కొత్త రకం విమార్కులు. హిందూత్వ-కార్పొరేట్ భేతాళుడిని ఇద్దరూ మోస్తూనే వున్నారు. ఆ మోతకి అధికారంలో ఉండడం, లేకపోవడం అనేదానితో నిమిత్తం లేదు. ఈ సనాతన ధర్మం విషయం ఆ ఇద్దరికీ తెలుసు. తెలుసును గనుక సమాధానం చెప్పేస్తే ? అమ్మో ! ఏమన్నా ఉందా ? తల ఏమౌతుంది ? అందుకే సమాధానం తెలిసీ మౌనం వహిస్తున్నారు. సినిమా హీరోలు అలా కాదు. మాట్లాడితేనే, అది కూడా ఒకానొక విధంగా మాట్లాడితేనే, ఒకానొక తరహా కథలున్న సినిమాల్లో నటిస్తేనే కదా వాళ్ళకి జాతీయ అవార్డులూ గట్రా వచ్చేది ?

ఈ తగువెందుకు, సూటిగా సనాతనం గురించి చెప్పొచ్చు కదా అని మీరు విసుక్కోకండి. మోడీ ప్రభుత్వం దేశానికి గాని, ప్రజలకు గాని ఏ మాత్రమూ ఉపయోగం లేని అనవసర వివాదాలను రేపడంలో ఆల్‌టైం ప్రపంచ రికార్డు సృష్టించింది. అందులో తాజా వివాదాలే ఇండియా-భారత్ అన్న రెండు పేర్లలో ఏది గొప్ప? అన్న తగువు. పేరులోనేమున్నది? గులాబీని గులాబీ అన్నా, రోజా అన్నా, లేకపోతే ఆ నాడు భీముడు తెచ్చిన సౌగంధికాపుష్పం అన్నా దాని వాసన ఒకే విధంగా ఉంటుంది తప్ప మారిపోదు అని షేక్స్పియర్ అంతటివాడు అన్నాడు. ఇండియా అన్నా, భారత్ అన్నా అది మన దేశమే. దానికి మూలకందం మన ప్రజల ఐక్యత. ఆ ఐక్యతకే ఏదో ఒక రూపంలో చిచ్చు పెడుతూ, దేశ పునాదినే నాశనం చేస్తూ, మరోపక్క దేశం గురించి వాపోయే నయవంచనలో ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి కూటమి స్పెషలిస్టులు.

ఇప్పుడు సనాతన ధర్మం గురించి వద్దాం. సమాజాన్ని అభ్యుదయం వైపు నడిపించేదే ధర్మం. ప్రజల మధ్య ఐక్యత, మానవత్వం, అభిమానం పెంచే విధంగా, అదే సమయంలో ప్రజల దైనందిన జీవితంలో జీవన ప్రమాణాలు అంతకంతకూ మెరుగుపడేలా, అసమానతలు తగ్గేలా, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం మరింత బలపడేలా దేశాన్ని నడిపించడం ప్రభుత్వ ధర్మం. బుద్ధుడు పశువులని వృధాగా యాగాల్లో చంపొద్దని, వాటి శక్తిని కూడా ఉపయోగించి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలని ఆనాటి సమాజాన్ని ముందుకు నడిపించే ధర్మాన్ని బోధించాడు కాబట్టి బౌద్ధం మన దేశంలో దాదాపు 800 సంవత్సరాలపాటు ప్రధాన ధర్మంగా వర్ధిల్లింది. అదే సనాతన ధర్మం గురించి చూద్దాం. చాలా కాలం వరకూ భూమిని నాగలితో దున్నడం అంటే మహా పాపం అని వ్యవసాయాభివృద్ధిని వ్యతిరేకించింది. అందుకే ఆ సనాతన కాలంలోనే సనాతన ధర్మాన్ని తిరస్కరించి ప్రజలు బౌద్ధాన్ని ఆదరించారు. పాలకవర్గాల, ఆధిపత్య కులాల దయ వలన సనాత ధర్మం ఇంకా బతికుంది గాని, ప్రజలకే పూర్తిగా వదిలిపెడితే ఎప్పుడో తేలిపోయేది.

సనాతన ధర్మం అన్నది బ్రాహ్మణాధిపత్యవాదులు రాసిన ధర్మ శాస్త్రాల్లో ఉంది. వాటన్నింటిలోకీ మనుధర్మ శాస్త్రం ప్రధానమైనది. వివక్షతతో నిండివున్న కుల వ్యవస్థను ఆ మను ధర్మశాస్త్రం బలపరిచింది. రాజ్యాంగం కుల వివక్షతను చట్టవిరుద్ధం అని ప్రకటించింది. దానికి అనుగుణంగా చాలా చట్టాలు ఉన్నాయి కూడా. సనాతనవాదులు ఆనాడు ఈ రాజ్యాంగాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. అప్పుడు ఆరెస్సెస్ కూడా రాజ్యాంగాన్ని అంగీకరించలేదు. మనుధర్మ శాస్త్రం ఉండగా వేరే రాజ్యాంగం ఎందుకని యాగీ చేసింది. మనువాదం అన్ని దశల్లోనూ స్త్రీ పురుషుడికి లొంగి వుండాల్సిందే అని చెప్తుంది. అమ్మాయికి యుక్త వయస్సు రాకుండానే పెళ్ళి అయిపోవాలని సనాతనధర్మం చెప్తుంది. అందువల్లనే ఇప్పటికీ మనదేశంలో ఇంకా బాల్య వివాహాలు జరుగుతూనే వున్నాయి. సతీ సహగమనం పతివ్రతాధర్మం అని సనాతన (అ)ధర్మం చెప్పింది. శూద్రులు చదువుకోకూడదు అని మనువు శాసించాడు. పొరపాటున చదివితే శంబూకుడికి పట్టిన గతే పడుతుంది సుమా అని రామకథ హెచ్చరించింది కూడా. అంటరానితనాన్ని ఆచారంగా పాటించి తీరాలని మనుధర్మం చెప్తోంది.

మోడీ, ఆయన అనుచరులు వెనకేసుకొస్తున్నది ఈ పనికిమాలిన, కాలం చెల్లిన ధర్మాన్నే. 75 సంవత్సరాల క్రితమే, మన దేశ ప్రజలు తమకు ఏ ధర్మం కావాలో స్పష్టంగానే ఎంచుకున్నారు. సనాతన ధర్మాన్ని, కుల, మత, లైంగిక, వివక్షత అనాగరికం అని తేల్చి చెప్పేశారు. సతీ సహగమనం ఇప్పుడు నేరం. అంటరానితనాన్ని పాటిస్తే అది నేరం. బాల్య వివాహాలు నిషిద్ధం, స్త్రీల పట్ల అగౌరవంగా వ్యవహరిస్తే అది నేరమే. అంటే, స్వతంత్ర భారతదేశ ప్రజలు వివక్షతాపూర్వకమైన ఆ సనాతన ధర్మం తమకు అవసరం లేదని తేల్చి చెప్పేశారు. మరి మోడీ సైన్యానికి ఎందుకు సనాతన ధర్మం పట్ల ఆసక్తి? గతకాలపు ఊహాజనిత, భ్రమాన్విత, బూటక వైభవం గురించి గొప్పగా చెప్పుకుంటూ, అటువైపే చూడమని (రెండో వైపు చూడకూ! చూస్తే తట్టుకోలేవూ! అని నటసార్వభౌమ జూ. అన్నది ఇందుకే) వర్తమాన సమాజంలో ప్రభుత్వ ఘోర వైఫల్యాల వైపు ఆ ప్రజలు చూడకుండా చేయడానికే.

ఒక వ్యాపార ప్రకటనలో "ఈ దేశంలో ఏది నడిచినా, నడవకపోయినా. ఫాగ్ మాత్రం నడుస్తూనే వుంటుంది" అని అంటాడు (ఫాగ్ అనేది ఒక బాడీ స్ప్రే పేరు). ఫాగ్ అంటే పొగమంచు అని అర్థం. ఆ విధంగా చూసుకుంటే ఆ ప్రకటన అతికినట్టు మన మోడీ పాలనకు సరిపోతుంది. విద్వేష రాజకీయాల, వృధా వివాదాల పొగమంచు దేశాన్నంతటినీ ఆవరించినందువలన ప్రజలకి మరేదీ కనిపించడం లేదు.

స్వామి వివేకానందుడు ఆకలిగొన్న కడుపు ఈ దేశంలో ఒక్కటి ఉన్నా సనాతన ధర్మం గురించి మాట్లాడే హక్కు ఎవరికీ లేదని స్పష్టంగా చెప్పాడు. జనాలు ఆకలితో ఒక పక్క ఛస్తూంటే వాళ్ళ గోడు పట్టించుకోకుండా గోమాత రక్షణ అంటూ బయలుదేరినవాళ్ళని ముక్కచీవాట్లు పెట్టాడు. ఆయన కట్టిన కాషాయానికి, ప్రభుత్వ కాషాయానికి ఎక్కడైనా పోలిక ఉందా? వివేకానందుడు మానవతను మించిన ధర్మం లేదన్నాడు. మానవతనే మరిచి గుజరాత్, మణిపూర్ తరహా మారణహోమాలకు ఆజ్యం పోస్తున్న మోడీ సర్కార్‌కి ఆ మానవత్వం లేశమైనా ఉందా?

సమాజంలో ఎల్లవేళలా ఒక సంఘర్షణ ఉంటుంది. ఆ ఘర్షణలో సమాజాన్ని ముందుకు నడిపించే శక్తులు ఒకవైపు చేరుతాయి. సమాజాన్ని వెనక్కి నెట్టి అభ్యుదయాన్ని అడ్డుకునే శక్తులు ఇంకోవైపు చేరతాయి. ఈ రెండింటి నడుమ జరిగే సంఘర్షణలో మనం ఏ వైపున ఉంటామో తేల్చుకోవాలి. "ఆ గట్టునుంటావా? ఈ గట్టుకొస్తావా?" అని మనల్ని అడిగిన హీరో గారు తాను సనాతన గట్టుమీదే ఉంటానని ప్రకటించేశాడు. అంటే సినీ జీవితంలో హీరో పాత్రల్ని పోషించినా వాస్తవ సమాజ జీవితంలో జీరో అవడానికే సిద్ధపడుతున్నాడు. పోనీయండి, అది అతగాడిష్టం. కాని మనం ఎటువైపున ఉంటామో మనమంతా తేల్చుకోవాలి కదా. సనాతనమా ? అభ్యుదయమా? ఎటువైపు?

"మంచి గతమున కొంచెమేనోయ్ మందగించక ముందు అడుగేయ్" అని యుగకర్త గురజాడ ఎప్పుడో చెప్పేశాడు. నిజమే కదా, వెనక్కి చూస్తూ చూస్తూ నడవడం మొదలెడితే గ్యారంటీగా బోర్లా పడతాం. అందుకే గురజాడ చెప్పినట్టు ముందుకే అడుగేద్దాం.

నవయుగ కవిచక్రవర్తి జాషువా ఏమన్నాడు?" కులమతాలు సృష్టించిన పంజరాన కట్టువడను, విశ్వ నరుడ నేను" అన్నాడు. మనదీ ఆ మాటే కావాలి.

మహాకవి శ్రీశ్రీ అవతలిగట్టున ఉన్నవారి గురించి ఏం చెప్పాడు? "తృప్తిగా చచ్చిపోతారు మీరు, ప్రపంచం మిమ్మల్ని మరిచిపోతుంది" మరి ఇవతల గట్టునున్నవాళ్ళో? "మేం ముందు నడుస్తాం. ప్రపంచం మా వెంట నడుస్తుంది" అన్నాడు.

అందుకే సనాతన పంజరాలను ఛేదించి, మందగించకుండా ముందడుగేస్తూ, కొత్త ప్రపంచాన్ని నిర్మించే మార్గాన నడుద్దాం, ప్రజలను నడిపిద్దాం.

మానవతా ధర్మో రక్షతి రక్షిత: ★

జనవాక్యం

పాత బడులకు 'కొత్త సోకులు'!

సర్కారు బడులలో నాడు నేడు పథకం పనులతో పాత బడులకు కొత్త సోకులు. స్కూలులో విద్యా ప్రమాణాలు ఎలా వున్నా... ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలతో పాఠశాలలో విద్యా బోధనం మిథ్య. వేళకు బడులకు వెళ్ళిన ఉపాధ్యాయులు ముఖ హాజరు పూర్తయితే..సుఖంగా ఫీలౌతారు..! లేటయితే...వారి ముఖ కవళికలు మారు తుంటాయి..!? టీచర్లు బోధనకి సిద్ధమౌ తుండగా...అదనపు పనులు చేయాలంటూ వారికి పైనుండి తక్షణం ఆదేశాలు..!? ముందుగా పాఠశాలలలోని మరుగుదొడ్ల ఫొటోలు తీసి హాజరైన విద్యార్థుల డేటాలు మధ్యాహ్న భోజనం తాలూకు వివరాలు ఫోన్ లోని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి..! ఆ తర్వాతే...పాఠాలకు శ్రీకారం. సర్వర్ పని చేయకపోతే ఇక జాగారమే..! పాఠాలు చెబుతుండగానే.. మధ్యలో అధికారులు నుండి ఫోన్లలో మెసేజ్‌లు!! బడులలో మౌలిక సదుపాయాలు ఎలా వున్నాయి..? విద్యార్థులు ఆరోగ్యం ఎలా ఉంది..? స్టూడెంట్లకి నులి పురుగులు మాత్రలు ఇచ్చారా..? జగన్ అన్న కిట్లు భేషుగ్గా వున్నాయి కదా..? చిన్నారులు అమ్మ ఆవుకు బదులుగా ఎబిసిడి లు వడిగా నేర్చుకుంటున్నారా..? సదరు ప్రశ్నలకు జవాబులు...తక్షణమే పంపాలని అధికారులు ఉత్తర్వులు...!? అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు సేకరించి ఫోన్‌లో వారు అప్‌లోడ్ చేస్తుండగా..సాయంత్రం పూట మోగుతుంది ఇంటి బెల్లు..! జగనన్న బ్యాగులు తగిలించుకుని విద్యార్థులు వెళ్లిపోతారు. డేటా అప్‌లోడ్ కాక...పూర్తి పాఠాలు చెప్పలేక కష్టశాలలో పాఠశాల ఉపాధ్యాయులు...!?

-జి. సూర్యనారాయణ, దివిసీమ.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

అభివృద్ధి పథాన భారత్ !!

● జి 20 సమావేశాల నేపథ్యంలో మోడీ సర్కార్ బూటకపు ప్రచారం ● వాస్తవాలు దాచి గొప్పలు

న్యూఢిల్లీ : జి-20 సదస్సుకు భారత్ అతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో ఆ సదస్సు గురించి, భారత్ సాధించిన ప్రగతి గురించి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటుంటోంది. మరోపక్క మెజారిటీ భారతీయులు ఎదుర్కొంటున్న జీవన పోరాటాలను బయటి ప్రపంచానికి తెలియనీయకుండా కప్పిపుచ్చేందుకు అధికారులు ప్రమాదకరమైన ఎత్తుగడలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

జి-20 సదస్సు గురించి ప్రచారం చేస్తూ రాజధాని ఢిల్లీ నగర వీధుల్లో ఎక్కడ చూసినా పెద్ద పెద్ద వాణిజ్య ప్రకటనల బోర్డులు కనిపిస్తున్నాయి. కానీ ఆ బిల్ బోర్డుల వెనుక గల మురికివాడల్లోని ప్రజలు, వారి జీవితాల గురించి ఎవరికీ పట్టడం లేదు. వారి జీవనోపాధికి కీలకమైన రోడ్డు పక్కన గల వారి దుకాణాలు, స్టాళ్ళు అన్నింటినీ ఈ సదస్సు పేరు చెప్పుకుని ధ్వంసం చేసేశారు. లేనిపక్షంలో కొత్తగా ఆవిర్భవిస్తున్న భారతదేశం అంటూ ప్రధాని నరేంద్ర మోడీ అంతర్జాతీయంగా అత్యంత జాగ్రత్తగా పెంచి పోషించుకుంటూ వస్తున్న పేరు ప్రతిష్టలకు కళంకం కలుగుతుంది.

భారత్‌ను ఒక బ్రాండ్‌గా చూపించే ప్రక్రియలో భాగంగా దేశ జిడిపి గణాంకాలను కూడా ఆ బిల్‌బోర్డుల్లో ప్రదర్శిస్తున్నారు. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో వార్షిక వృద్ధి రేటు 7.8 శాతంతో భారత్ అత్యంత వేగంగా ఆవిర్భవిస్తున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కనిపిస్తోంది. కానీ, బిల్‌బోర్డుల వెనుక పెద్ద ఎత్తున ప్రజలు జరుపుతున్న పోరాటాలు, ఉద్యమాలు వున్నాయి. నిజానికి, అభివృద్ధి చాలా తక్కువగా వుంది. అసమానతలు పెరుగుతున్నాయి. ఉపాధి కొరత తీవ్ర స్థాయిలో వుంది. వీటి గురించిన సమాచారాన్ని తొక్కిపట్టేందుకు అధికార యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది.

భారత జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) తాజా నివేదిక ప్రకారం ఏప్రిల్-జూన్‌లో ఉత్పత్తి రంగ

ఆదాయం వార్షికంగా 7.8 శాతం పెరిగినట్లు చూపించింది. కానీ అదే సమయంలో వ్యయం మాత్రం కేవలం 1.4 శాతమే పెరిగింది. ఈ రెండు రకాల లెక్కలను గణించడంలో బహుశా చాలా పొరపాట్లు వుండి వుంటాయి. అయినా, ఇక్కడ మనం గమనించాల్సిన అంశమేమంటే ఆదాయ వ్యయాలు రెండూ సమానంగా వుండాలన్నది అంతర్జాతీయంగా అనుసరించే అత్యుత్తమ సూత్రం. కానీ ఇక్కడ ఆదాయం ఎక్కువుంది, ఖర్చు తక్కువుంది. అంటే మెజారిటీ సంఖ్యలో భారతీయులు ఇబ్బందులు పడుతున్న సమయంలో, భారతీయ ఉత్పత్తులకు విదేశాల్లో పరిమితమైన డిమాండ్ మాత్రమే వున్న సమయంలో ఖర్చులో లోటు కనిపిస్తోంది, కానీ దాన్ని కప్పిపుచ్చడానికి ఎన్‌ఎస్‌ఓ ప్రయత్నిస్తోంది. ఆదాయ వ్యయాలను కలిపితేనే దేశ ఆర్థిక వ్యవస్థను అంచనా వేయగలుగుతాం.అదే సరైన పద్ధతి.

2019లో భారత్ జిడిపి వృద్ధిరేటు 3.5 శాతంగా వుంది. కోవిడ్ కారణంతో వృద్ధి రేటు ఇంకా తగ్గింది. అప్పటి నుండి పురోగతి మందగించింది. ఈ విషయాన్ని తాజా డేటా ధృవీకరించడమే కాకుండా, దీనికి గల కారణాలేంటో కూడా పేర్కొంటోంది. ఉపాధికి పట్టుగొమ్మ అయిన తయారీ రంగం బాగా బలహీనపడిపోయింది. దశాబ్దాల తరబడి నిరాశాజనకమైన అభివృద్ధిని నమోదు చేస్తూ వచ్చిన ఈ రంగం కోవిడ్ అనంతర కాలంలో కూడా పుంజుకోలేదు. కొరుకుడు పడని ఈ వాస్తవాలన్నింటినీ కొట్టిపారేయడానికే కేంద్రం చూస్తోంది. మందగించిన అభివృద్ధి, పెరుగుత్ను అసమానతలు, పేలవమైన ఉపాధి అవకాశాలు వీటన్నింటినీ కప్పిపుచ్చేందుకు జాతీయ గణాంకాలను మోసపూరితంగా ప్రచారం చేస్తున్నారు. వారు భారతదేశానికి నిర్దేశించిన పంథాను గుర్తించి, పున:పరిశీలించుకోవడం మంచిది.

బాధాకరం : ఏచూరి

న్యూఢిల్లీ : విశ్వవేదికలపై గొప్పలు చెప్పుకునేందుకు దేశం గురించి తప్పుడు సమాచారంతో, గణాంకాలతో మోడీ సర్కార్ వండివారుస్తున్న కథనాలు, ప్రచార ఆర్భాటాలు భారత ప్రతిష్టను దిగజార్చుతున్నాయని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలా బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. మోడీ ప్రభుత్వం చెబుతున్నదంతా 'నకిలీ అభివృద్ధి' అంటూ అంతర్జాతీయ మీడియా ప్రచురించిన కథనాలను ఏచూరి తన పోస్టుకు జత చేశారు. కార్పొరేట్ కంపెనీలకు సర్వం దోచిపెడుతూ, సామాన్య ప్రజానీకంపై భారాలు మోపుతున్న నేపథ్యంలో దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక, సామాజిక అసమానతలను, నిరుద్యోగితను, అంతకంతకూ దిగజారిపోతున్న జిడిపి గణాంకాలను మార్పులు చేసిన గొప్పగా చెప్పినంతనే అభివృద్ధి జరిగిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. భారత ప్రతిష్ట పెరగాలంటే కావాల్సింది తప్పుడు లెక్కలు కాదని, సమతుల్య అభివృద్ధి అని ఆయన హితవు పలికారు.

ఓట్ల లెక్కింపు బహిష్కరణ : సిపిఎం నిర్ణయం

అగర్తల : త్రిపుర ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపును బహిష్కరిస్తున్నట్లు సిపిఎం పేర్కొంది. ఈ నెల 5న జరిగిన ఉప ఎన్నికల్లో రిగ్గింగ్‌ను అరికట్టేందుకు భారత ఎన్నికల సంఘం (ఇసి) ఎలాంటి చర్యలుచేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. సెపాహిజాలా జిల్లాలోని బాక్సానగర్, ధన్‌పూర్ అసెంబ్లీ స్థానాల్లో సగటున 86.5 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సందర్భంగా పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరిగిందని తెలిపింది. " పోలింగ్ ప్రారంభం నుండే ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లాం. కానీ రిగ్గింగ్‌ను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరం" అని సిపిఎం కన్వీనర్ నారాయణ్ కర్ బుధవారం రాత్రి పేర్కొన్నారు. ఎన్నికలను రద్దు చేసి మరోసారి పోలింగ్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశామని, అయితే ఇసి నిరాకరించిందని అన్నారు. ఇసి ఉద్దేశ్యం చాలా స్పష్టంగా ఉంది. ఈ స్థితిలో సెప్టెంబర్ 8న జరగాల్సిన ఓట్లలెక్కింపులో పాల్గొనడం అనవసరం. దీంతో కౌంటింగ్‌ను బహిష్కరిస్తున్నామని అన్నారు.

విస్తార్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
VISTAAR FINANCE
రిజిస్టర్డు ఆఫీసు: ప్లాట్ నం.59& 60-23, 22వ క్రాస్, 29వ మెయిన్ బిటిఎం, 2వ స్టేజి, బెంగళూరు 560076. www.vistaarfinance.com

అనుబంధం 4 (రూలు 8(1) చూడండి
స్వాధీనతా ప్రకటన (స్థిరాసి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు విస్తార్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది [illegible]

... 1లో వార్డు నం.19, చిలకలపూడి ఏరియా, మచిలీపట్నం మున్సిపాలిటీ, మచిలీపట్నం సబ్-రిజిస్ట్రేషన్, కృష్ణా జిల్లా వద్ద స్థిరాస్తి యొక్క మొత్తం భాగం. మరియు **సరిహద్దులు:** తూర్పు: గుడిసేవ జలచంద్రా రావు కుమారుల సైటు 3అ.లు, పడమర: నందికోట నాగేశ్వర రావు సైటు 3అ.లు, ఉత్తరం: నందికోట సత్యనారాయణ సైటు భాగం మరియు 26.3అ.ల దారి భాగం, దక్షిణం: 1వ ఐటెం సైటు 26.3అ.లు. ఏదైతే కృష్ణా జిల్లా, మచిలీపట్నం మున్సిపాలిటీ, మచిలీపట్నం సబ్-రిజిస్ట్రీ, చిలకలపూడి ఏరియా హద్దుల్లోగల పై వివరించిన ఆస్తి, దానికి అనుబంధంగా ఈసిమెంట్ హక్కులతో (87.52+8.76) 96.28చ.గ.ల విస్తీర్ణంతో ఆర్‌సిసి రూఫ్ భవనము.

తేది: 05.09.2023
ప్రదేశం: మచిలీపట్నం
అధీకృత అధికారి
విస్తార్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్

సర్వం సిద్ధం

- రేపటి నుంచి జి20 శిఖరాగ్ర సమావేశాలు
- ఢిల్లీలో 'లాక్‌డౌన్' తరహా ఆంక్షలు
- రాజధాని సరిహద్దులు మూసివేత
- నేడు బైడెన్ మోడీ ద్వైపాక్షిక భేటీ

న్యూఢిల్లీ : శనివారం నుండి రెండు రోజుల పాటు జరిగే జి-20 శిఖరాగ్ర సమావేశం కోసం దేశ రాజధాని ఢిల్లీ ముస్తాబైంది. ప్రగతి మైదాన్‌లో అధునాతన సదుపాయాలతో నిర్మించిన 'భారత్ మండపం' కన్వెన్షన్ సెంటర్ ఈ సమావేశానికి ప్రధాన వేదికగా నిలవనుంది. ఆర్భాటపు హంగుల కోసం మోడీ ప్రభుత్వం వందల కోట్లు వెచ్చించింది. ఎటుచూసినా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖచిత్రాలు కనిపించేలా భారీ హోర్డింగ్‌లు, లైటింగ్స్ ఏర్పాటు చేశారు. భారత్ అధ్యక్షత వహిస్తున్న ఈ సదస్సులో ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాలపై వివిధ దేశాల నేతలు చర్చలు జరపనున్నారు. శుక్రవారమే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ధనిక దేశాల అధినేతలు పలువురు వస్తుండడంతో భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. నేటి రాత్రి ప్రధాని మోడీ జో బైడెన్ మధ్య ద్వైపాక్షికసమావేశం జరగనుంది. నగరంలో మూడు రోజు పాటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు సెలవులు ప్రకటించారు. వీధులను కుడ్య చిత్రాలు, బ్యానర్లు, ఫౌంటైన్లు, మొక్కలతో అలంకరించారు. విదేశీ అతిథులతో కమ్యూనికేట్ చేయడానికి 100 మంది మహిళా పారిశ్రామిక వేత్తలను చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సిటిఐ) నియమించుకుంది. వీరంతా ఇంగ్లీష్, ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్, తదితర భాషలను అనర్గళంగా మాట్లాడతారని సిటిఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ తెలిపారు. ఈ మహిళల జాబితాను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు చెప్పారు. అలాగే గురుగ్రామ్ జిల్లాలో ఈ నెల 8 నుంచి వర్క్‌ఫ్రమ్ హోమ్ చేయాలని ఉద్యోగులను ఆదేశించాలని అన్ని కార్యాలయాలకు ఆ జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. జిల్లాలోని అన్ని కార్పొరేట్, ప్రైవేట్ కార్యాలయాలకు ఈ మేరకు సలహాను జారీ చేసింది. ఈ సదస్సుకు జి 20 దేశాధినేతలు, యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఉన్నతాధికారులు, అతిథి దేశాలు, అంతర్జాతీయ సంస్థల ఉన్నతాధికారులు హాజరవుతున్నారు.

"వసుధైక కుటుంబం" లేదా "ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒక భవిష్యత్తు" అనే థీమ్‌తో ఈ సమావేశాలు జరుగుతున్నాయి. సమావేశానికి హాజరవుతున్న ప్రముఖుల్లో అమెరికా అధ్యక్షులు జో బైడెన్, చైనా ప్రధానమంత్రి లి కియాంగ్ ఉన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ సమావేశంలో పాల్గొన లేనని ఇప్పటికే ప్రకటించారు. రష్యా నుంచి ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ప్రాతినిధ్యం వహిస్తారని పుతిన్ చెప్పారు. కెనడా, ఇంగ్లాండ్ ప్రధాన మంత్రులు జస్టిన్ ట్రూడో, రిషి సునక్ హాజరుకానున్నారు. జి 20 చర్చలతో పాటు, యుకె-ఇండియా వాణిజ్య చర్చలకు సంబంధించి ప్రత్యేక చర్చలల్లో మోడీతో సునక్ పాల్గొంటారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, జపాన్ ప్రధాని కిషిడా ఫుమియో, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ కూడా ఈ భేటీకి హాజరుకానున్నారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా అధ్యక్షులు యున్ సుక్ యోల్ హాజరుకానున్నారు. ఫ్రాన్స్ నుంచి ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా ఈ సదస్సులో పాల్గొననున్నారు. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్, అర్జెంటీనా అధ్యక్షుడు అల్బెర్టో ఫెర్నాండెజ్, నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబు ఈ సదస్సులో పాల్గొననున్నారు. వీరంతా శుక్రవారం రాత్రి కల్లా న్యూఢిల్లీ చేరుకునే అవకాశం ఉంది. అయితే మరోవైపు..ఈ సమావేశంలో సౌదీ అరేబియా, ఇటలీ, జర్మనీ, ఇండోనేషియా, బ్రెజిల్ వంటి దేశాలు పాల్గొనడంపై అనిశ్చితి కొనసాగుతుంది.

అభ్యర్థన అందితే పరిశీలిస్తాం : ఐరాస

ఐక్యరాజ్యసమితి : ఏదైనా దేశం తన పేరును మార్చాలని కోరుతూ అభ్యర్థన పంపితే అప్పుడే దానిని పరిశీలిస్తామని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఇండియా పేరును భారత్‌గా మార్చేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుట్టెరస్ సహాయ ప్రతినిధి ఫర్హాన్ హక్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన గత సంవత్సరం టర్కీ పేరును తుర్కియేగా మార్చిన విషయాన్ని గుర్తు చేశారు. 'తుర్కియే విషయానికి వస్తే అక్కడి ప్రభుత్వం పంపిన అభ్యర్థనపై మేము స్పందించాము. అలాంటి అభ్యర్థనలు ఏవైనా వస్తే అవి వచ్చినప్పుడు నిర్ణయం తీసుకుంటాం' అని ఆయన చెప్పారు. కాగా 'భారత్'పై వివాదం చెలరేగకుండా చూడాలని ప్రధాని మోడీ తన కేబినెట్ సహచరులకు సూచించారు. అది దేశం యొక్క పురాతన పేరని గుర్తు చేశారు.

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
equitas SMALL FINANCE BANK LTD
(గతంలో ఈక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)
నమోదిత కార్యాలయం: నం.769, స్పెన్సర్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-II, అన్నా సలై, చెన్నై, టిఎన్-600 002.
044-42995000, 044-42995050

డిమాండ్ నోటీసు -సర్ఫేసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు

ఈక్విటాస్ హౌసింగ్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఇహెచ్‌ఎఫ్‌ఎల్)/ఈక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇఎఫ్‌ఎల్)/ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఇఎస్‌ఎఫ్‌బి) నుండి దిగువ రుణగ్రహీత/లు రుణం పొందినారని ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది. సదరు రుణగ్రహీతలు మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనారు మరియు ఆర్‌బిఐ ద్వారా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వారి లోన్ ఎకౌంట్‌ను నాన్-పెర్ఫామింగ్ ఎసెట్ గా వర్గీకరించబడింది. రుణగ్రహీత(లు) ద్వారా సదరు తేది నాటికి చెల్లించాల్సిన సెక్యూర్డ్ స్థిరాస్థు/లు, లోన్ మరియు అసాధారణ మొత్తం వివరాలు దిగువన ఇవ్వబడినాయి. రుణగ్రహీత(లు) అదే విధంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు, **SARFAESI** చట్టం, 2002 యొక్క నిబంధనల క్రింద దిగువ రుణగ్రహీత(లు)కు వ్యతిరేకంగా చర్యలను ప్రారంభించాడు. ఒకవేళ క్రింది రుణగ్రహీత(లు) ఈ నోటీసు ఇచ్చిన 60 (అరవై) రోజులలోపు వారి పేర్లకు ఎదురుగా సూచించిన బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైతే, **SARFAESI** చట్టంలోని సెక్షన్ 13 లోని సబ్-సెక్షన్ (4) క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ మీద ఒకటి లేదా అంతకంటే అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువసంతకందారుడు, ఆస్తి/లు స్వాధీనం చేసుకోవడంతో పాటు అధికారం తీసుకొని/ఏదావిధిగా అమ్మబడును. క్రింద వివరించిన ఆస్తి/లతో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించరాదని సాధారణంగా ప్రజలకు సూచిస్తున్నాము.

రుణగ్రహీత(లు)/హామీదారు(ల) పేరు (శాఖ పేరు)	13(2) నోటీసు తేది దావా మొత్తం	సెక్యూర్డ్ అస్సెట్ వివరణ (స్థిరాస్తి)
శాఖ: గుంటూరు. L. No: SEGNTUR0307857 రుణగ్రహీత: శ్రీ. గోవర సాంబశివరావు, హామీదారులు: శ్రీమతి. గోవర జయ.	09-08-2023 & Rs. 966385/-	గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, గుంటూరు మండలం, కోరెటిపాడు గ్రామం మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సెల్ రెసిడెన్షియల్ ఖాళీ భూమి, పాత ఇంటి బేరింగ్ డో.నం.1-8-25, మూల్యాంకనం నం.00051, కొలిచే: డో.నం. 282 లో 51 1/4 చ.గ.లు లేదా 42.8 చ.మీ.లు. క్రింది విధంగా ఉన్న సరిహద్దులు: ఉత్తరం: సిహెచ్. జానకమ్మ ఆస్తి 41.00 అ.లు., దక్షిణం: శ్రీనివాసరావు ఆస్తి షెడ్యూల్ బి 41.00 అ.లు., తూర్పు: మున్సిపల్ రోడ్డు 11-06 అ.లు., పడమర: చిన్నమ్ జానకమ్మ ఆస్తి 11-00 అ.లు. కొలతలు: కొలత: 51 1/4 చ.గ.లు లేదా 42.8 చ.మీ.లు. గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా మరియు కొర్రిటిపాడు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది.

తేది: 08.09.202 ప్రదేశం: గుంటూరు
అధీకృత అధికారి, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

ద్వేషాన్ని నిర్మూలించేంత వరకు జోడో యాత్ర

- రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : ద్వేషాన్ని నిర్మూలించి, భారత్ ఐక్యంగా ఉండే వరకు జోడో యాత్ర చేపడతానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు 4,000 కి.మీ మేర రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మొదటి వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాహుల్ ప్రత్యేకంగా గురువారం ఎక్స్ (ట్విటర్)లో ట్వీట్ చేశారు. గతేడాది ఇదే రోజున యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. " ప్రేమ, ఐక్యత వైపు భారత్ జోడోయాత్ర కోట్లాది అడుగులు రేపటి మెరుగైన దేశ భవిష్యత్ కోసం పునాదిగా మారాయి. ద్వేషాన్ని పూర్తిగా నిర్మూలించి, భారత దేశం ఏకం అయ్యే వరకు ఈ యాత్ర కొనసాగుతంది. ఇది నా వాగ్దానం" అని హిందీలో ట్వీట్ చేశారు.

భారత్ జోడో యాత్ర సమయంలో రాహుల్ గాంధీ 13 మీడియా సమావేశాలతో పాటు 12 బహిరంగ సమావేశాలు, వందకు పైగా కూడళ్లలో చిన్నపాటి సమావేశాలు నిర్వహించారు. ఈ యాత్రలో పలువురు రాజకీయ నేతలతో పాటు మాజీ ఆర్మీ అధికారులు, టివి, సినీనటులు పాల్గొన్నారు.

రమ్మీపై కర్ణాటక హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : రమ్మీ వంటి ఆన్‌లైన్ ఆటలపై పన్ను వేయడానికి లేదని, బెట్టింగ్, జూదం మాదిరిగా ఈ ఆటలు జిఎస్‌టి చట్టం పరిధిలోకి రావంటూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం గురువారం స్టే విధించింది. జిఎస్‌టి డైరెక్టరేట్ జనరల్ వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ విచారణ జరిపి, ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ అయిన గేమ్‌స్కర్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా ఆ సంస్థకు గడువు ఇచ్చింది. అక్టోబరులో విచారించడానికి ఈ కేసును వాయిదా వేసింది. కంపెనీ జూదానికి పాల్పడుతోందని, ఆన్‌లైన్ గేమ్ ఆడేందుకు ప్లేయర్లు చెల్లించే మొత్తంపై 28శాతం జిఎస్‌టిని చెల్లించకుండా కంపెనీ ఎగవేసిందని పేర్కొంటూ గతేడాది సెప్టెంబరు 23న కంపెనీకి జిఎస్‌టి డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. రూ.21వేల కోట్లు జిఎస్‌టిని కంపెనీ ఎగ్గొంటిందని పేర్కొంది. దీనిపై ఆ కంపెనీ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. రమ్మీ అనేది నైపుణ్యంతో కూడిన ఆట అయినందున దాన్ని జూదం, బెట్టింగ్ నిర్వచనం పరిధిలోకి తీసుకురాలేమని హైకోర్టు పేర్కొంది.

ఉదయనిధి వ్యాఖ్యలకు వక్రభాష్యాలు

- 'మారణహోమం' అనే పదం ఉదయ్ వాడలేదు : స్టాలిన్

చెన్నై : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైనా, సంఘ్ పరివార్ నేతల వ్యవహార శైలిపైనా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ గురువారం నాడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతన ధర్మంలోని మూఢచారాలను, వర్ణ వివక్షతను రూపుమాపాలంటూ ఇటీవల తన కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలను బిజెపి వక్రీకరిస్తోందని విమర్శించారు. బిజెపి నేతలు చెబుతున్నట్లుగా 'మారణహోమం' అనే మాటనుఉదయ్ ఎన్నడూ ఉపయోగించలేదని స్టాలిన్ పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే ఇలాంటి విష ప్రచారం చేస్తున్నారని తెలిపారు. 'ఏ మతానికి మేము శత్రువులం కాదు. ఈ విషయం అందరికీ తెలుసు. పుట్టక సమయంలో అందరూ సమానమే. అలాగే సమాజంలోనూ అందరూ సమానంగా జీవించాలన్నదే మా ఆకాంక్ష' అని స్టాలిన్ తెలిపారు. 'ఇండియా' ఫోరానికి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక మోడీ అండ్ కో ఇలాంటి ఎత్తుగడులకు పాల్పడుతోందని, వచ్చే సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొనడానికి బిజెపి ఇలాంటి అపవాదులపైనే ఆధారపడుతుందని ఆయన చెప్పారు.

తొమ్మిదేళ్లలో చేసిందేమీ లేదు : ఉదయనిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో చేసిందేమీ లేదని ఉదయనిధి పేర్కొన్నారు. తనపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా వాటిని చట్టపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు. తనపై చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ఏం చేశారని దేశం యావత్తు నిలదీస్తోందని, దేశంలో అవినీతి పెరిగిపోయిందనీ, మణిపూర్‌లో హింసాకాండ వంటి ఇతర సమస్యలను నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే బిజెపి ఇలాంటి ఎత్తుగడులు వేస్తోందని విమర్శించారు.

ఆసియాన్‌తో సోదర సంబంధాలు

- చైనా ప్రధాని లీ కియాంగ్

జకార్తా: ఆగ్నేయాసియా దేశాలతో సోదర సంబంధాలు కొనసాగించేందుకు తాము అధిక ప్రాధాన్యమిస్తామని చైనా ప్రధాని లీ కియాంగ్ చెప్పారు.ఈ ప్రాంత దేశాల మధ్య ఏదైనా వివాదం వుంటే దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవచ్చని, ప్రచ్ఛన్న యుద్ధానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్కారమివ్వరాదని ఆయన ఉద్బోధించారు. ఆసియాన్ శిఖరాగ్ర సదస్సుకు అతిథి హోదాలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా లీ కియాంగ్ మాట్లాడుతూ, కోవిడ్ వంటి క్లిష్ట సవాల్‌ను ఎదుర్కోవడంలో ఒకరికొకరం సహకరించుకున్నామని, ఆసియాన్‌తో సోదర సంబంధాలకు ఇదొక నిదర్శనమని ఆయన అన్నారు. ఏవైనా వివాదాలు, విభేదాలు ఉంటే వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని ఆయన చెప్పారు. గ్లోబల్ సూపర్ పవర్‌గా చైనా ఎదుగుదలను అడ్డుకునేందుకు అమెరికా ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వంతో వ్యవహరిస్తోందని లీ కియాంగ్ విమర్శించారు.

అమెరికా కుయుక్తులకు చెక్

గత నెలలో చైనా విడుదలజేసిన కొత్త మ్యాప్ పైన, అలాగే దక్షిణ చైనా సముద్ర దీవులపై పొరుగుదేశాలను ఎగదోసేందుకు అమెరికా చేసిన యత్నాలను ఫిలిప్పీన్స్ తిరస్కరించింది.' రెండు శక్తివంతమైన దేశాల మధ్య వ్యూహాత్మక పోటీ లెన్స్ ద్వారా దక్షిణ చైనా సముద్ర వివాదాన్ని చూడలేం. ఇందుకు సంబంధించి తప్పుదారి పట్టించే కథనాలను ఫిలిప్పీన్స్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది,' అని ఆ దేశ అధ్యక్షుడు ఫెర్డినాండో మార్కోస్ జూనియర్ తేల్చి చెప్పారు.

ఈ సదస్సుకు అతిథి హోదాలో హాజరైన అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ దక్షిణ చైనా సముద్ర దీవుల వివాదాన్ని ఆసరా చేసుకుని చైనాకు వ్యతిరేకంగా ఆసియాన్ దేశాలను ఎగదోసే యత్నం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంత దేశాల భౌగోళిక సమగ్రత పరిరక్షణకు అమెరికా మద్దతు ఉంటుందని ఆమె అన్నారు.

ఆసియాన్ డిక్లరేషన్ ఆమోదం

ప్రపంచవ్యాపితంగా అనిశ్చితి నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో 43వ ఆసియాన్ సమ్మిట్ విజయవంతంగా ముగిసింది. గురువారంతో ముగిసిన ఈ మూడు రోజుల సదస్సులో ఆసియాన్ నాయకులు ఒక డిక్లరేషన్‌ను ఆమోదించారు. పలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. తదుపరి ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు 2024లో లావోస్‌లో జరుగుతుంది. మయన్మార్‌లో నాలుగు వేల మందిని చంపి, వేలాది మందిని నిర్బంధించిన మయన్మార్ సైనిక ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా 2021లో ఆసియాన్ ఆమోదించిన అయిదు అంశాల తీర్మానం అమలులో ఎలాంటి పురోగతి లేకపోవడం పట్ల ఆగ్నేయాసియా దేశాల నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.వాతావరణ మార్పులపై ప్రాంతీయ కర్బన ఉద్గారాల తగ్గింపునకు సంబంధించి ఒక ఉమ్మడి ప్రకటన చేశారు. ముగింపు కార్యక్రమంలో ఇండొనేషియా అధ్యక్షుడు మాట్లాడుతూ, ఆసియాన్ లక్ష్యాలను సాధించేందుకు మరింత కృషి చేయాలన్నారు.

హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్
homefirst We'll take you home
సిఐఎన్: L65990MH2010PLC240703, వెబ్‌సైట్: homefirstindia.com
ఫోన్ నెం.: 180030008425, ఇ- మెయిల్ ఐడి : loanfirst@homefirstindia.com
సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలైన మీరు షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తిని తాకట్టుపెట్టుటచే రుణం పొందియున్నారు మరియు దిగువ పేర్కొన్న మీరు రుణ ఒప్పందం కొరకు రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత హామీదారుగా వాన్నారు. మీరు డిఫాల్ట్ చెందిన పర్యవసానంగా, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (సంక్షిప్తంగా సర్ఫేసి చట్టంలో) యొక్క నియమాల క్రింద **03.09.2023**న నాన్-పర్ఫార్మింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. మేము హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ గా మీరు సమర్పించిన చిరునామాకు సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(13)తో చదవగల సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేశాము. సదరు నోటీసులు **03.09.2023**న జారీ చేయబడినవి మరియు సదరు నోటీసులో పేర్కొన్నదేమనగా మీకు మంజూరు చేయబడిన చెల్లింపుల్లో మీరు డిఫాల్ట్ చెందియున్నారు. కావున, సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(2) యొక్క నియమాలు మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1) క్రింద నియమాలను అనుసరించి నోటీసు పంపుటకు ప్రస్తుత ప్రచురణ జారీచేయబడినది.

క్ర సం	ఖాతా, రుణగ్రహీత(లు)& హామీదారు(ల) పేరు మరియు చిరునామా	ఎన్‌ఫోర్స్ చేయబడు సెక్యూరిటీ యొక్క వివరాలు	డిమాండ్ నోటీసు తేది నాటికి మొత్తం బకాయిలు ప్లస్ తదుపరి వడ్డీ మరియు ఇతర వ్యయాలు (రూ.లో)
1.	రాజగోపాలం శ్రీనివాసన్, 2.అమ్మల్ జానకి శ్రీనివాసన్	రో హౌస్ నం. 190/2, (డోర్.నం. 8-31) గుంటుపల్లి గ్రామ పంచాయతీ, ఎస్ఆర్ఓ ఇబ్రహీంపట్నం, కృష్ణాజిల్లా, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-521241	14,31,760

ఇందుమూలంగా మిమ్మల్ని కోరడమేమనగా వడ్డీ మరియు ఖర్చులతో పై మొత్తాలను ఈ నోటీసు తేది ప్రచురణ తేది నుండి 60 రోజుల కాలవ్యవధిలోపు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారికి చెల్లించాలి, విఫలం చెందితే రుణగ్రహీతలు, తాకట్టుదారులు మరియు హామీదారుల యొక్క సెక్యూర్డు ఆస్తుల స్వాధీనతా తీసుకొనుటతోసహా సెక్యూర్డు అసెట్స్ యొక్క అన్ని లేదా ఏదేని లేదా మరిన్నింటిపై సదరు చట్టం యొక్క నియమాల క్రింద **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** అవసరమైన చర్య తీసుకుంటుంది. సదరు చట్టం క్రింద **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు లభించు అధికారాలతోసహా (1) సెక్యూర్డు అసెట్స్ రియలైజింగ్ కొరకు అమ్మకం యొక్క లీజు, అసైన్‌మెంట్‌చే బదిలీచేయు హక్కులతో సహా రుణగ్రహీతలు/హామీదారుల సెక్యూర్డు అసెట్స్ స్వాధీనతాను చేపట్టు అధికారం (2) **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** చే సెక్యూర్డు అసెట్‌గా ఏదేని బదిలీ మరియు సెక్యూర్డు అసెట్స్‌ను రాబట్టుటకు మరియు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో బదిలీ హక్కులతోసహా సెక్యూర్డు అసెట్ యొక్క మేనేజ్‌మెంట్‌పై తీసుకొనుటకు అన్ని హక్కులు మరియు మీచే బదిలీ చేయబడినందున బదిలీ చేయబడిన సెక్యూర్డు ఆస్తులకు సంబంధించినవి.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) యొక్క నియమాలను అనుసరించి, మీరు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారి ముందస్తు అనుమతి లేకుండా **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు హైపోతికేట్ చేసిన/ తాకట్టుపెట్టిన మరియు పై సూచించిన సెక్యూర్డు అస్తుల ఏదేని అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (మీ వ్యాపారం యొక్క నార్మల్ కోర్స్‌లో కాకుండా) రూపంలో బదిలీచేయుట నుండి మీరు నిషేధించబడినారు.

ప్రదేశం: విజయవాడ
తేది: 08/09/2023
సం/- అధీకృత అధికారి,
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

ఇ-వేలం - అమ్మకం నోటీసు
ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
CIN: U67100MH2007PLC174759
రీటైల్ సెంట్రల్ మరియు నమోదిత కార్యాలయం: ఈడెల్‌వీస్ హౌజ్, ఒయఫ్‌యఫ్ సి.ఎస్.టి రోడ్ , కలిన, ముంబాయి 400098

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్") యొక్క రూల్ 8(6) మరియు 9(1) నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002,క్రింద సెక్యూర్డ్ అసెట్స్ స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు.

ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ సెక్యూర్డ్ క్రెడిటార్‌కు కేటాయించబడిన ఆర్థిక సౌకర్యాలు అందించిన కాలమ్‌లో స్పష్టంగా పేర్కొన్న వివిధ ట్రస్ట్‌ల ట్రస్టీగా వ్యవహరిస్తుంది. ఇఎఆర్‌సి ఈ అసైన్‌మెంట్‌కు అనుగుణంగా ఇఎఆర్‌సి అసైనర్‌కి చేరింది. మరియు సురక్షితమైన రుణదాతగా దాని హక్కులను వినియోగించుకుంటుంది.ఆ ఇఎఆర్‌సి, సెక్యూర్డ్ క్రెడిటర్ హోదాలో, క్రింద పేర్కొన్న స్థిరమైన సెక్యూర్డ్ ఆస్తులను సర్ఫేసీ చట్టం మరియు 13(4) నిబంధనల క్రింద స్వాధీనం చేసుకుంది.
30 రోజుల నోటీసు దీని ద్వారా సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత మరియు హామీదారు(లు)కి ఇవ్వబడింది, క్రింద వివరించిన స్థిరమైన సెక్యూర్డ్ అసెట్స్, సెక్యూర్డ్ క్రెడిటార్‌కి అనుకూలంగా తనఖా పెట్టబడ్డాయి, దాని భౌతిక స్వాధీనాన్ని సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ఆధీకృత అధికారి (ఎఓ) తీసుకున్నారు. "ఎక్కడ ఉందో అలాగే" "ఉన్నది ఉన్నట్లే" మరియు "అక్కడ ఏదైనా ఉంది" ఆధారంగా రుణగ్రహీత మరియు హామీదారుల నుండి ఇఎఆర్‌సి ద్వారా స్వీకరించబడిన ఏదైనా డబ్బు కోసం తీసివేయబడిన తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు /ఖర్చులతో పాటు ఇఎఆర్‌సి కారణంగా దిగువ పేర్కొన్న మొత్తాలను తిరిగి పొందడం కోసం. ప్రతి ఆస్తికి రిజర్వ్ ధర మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ క్రింద పేర్కొనబడ్డాయి.

ఇవేలం కొరకు ఉంచిన సెక్యూర్డ్ అసెట్స్ వివరాలు:

క్ర. సం	లోన్ ఎకౌంట్ నెం/విక్రయ సంస్థ	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత యొక్క పేర్లు	ట్రస్ట్ పేరు	బ్యాంక్ పేరు మరియు బ్రాంచ్, అకౌంట్ నెం మరియు ఐఎఫ్‌ఎస్‌సి కోడ్	06.09.2023 నాటికి మొత్తం బకాయిలు ఐఎన్‌ఆర్	రిజర్వ్ ధర (ఐఎన్‌ఆర్ లో)	ధరావత్తు (ఇఎమ్‌డి) ఐఎన్‌ఆర్ లో	వేలం తేదీ మరియు సమయం	స్వాధీనతా రకం
1	LVI-JSTH0000045 390 / EHFL	శ్రీ.బలుసు సత్యనారాయణ ("రుణగ్రహీత") 2) శ్రీమతి. బలుసు దుర్గ ("సహ-రుణగ్రహీత")	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్ 447	ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, నారిమన్ పాయింట్, 000405131105 ICIC0000004	Rs. 36,94,738.52/-	Rs. 17,05,000/-	Rs. 1,70,500/-	11.10.2023 AT 11:00 AM	భౌతికం
ఆస్తి వివరణ : కృష్ణాజిల్లా, పటమట సబ్ రిజిస్ట్రార్, పెనమలూరు మండలం, కానూరు గ్రామ పంచాయతీ యొక్క డో.నం.18-738, ప్లాట్ నం.4 మరియు 4ఎ, విజిటిఎమ్ ఉడా ఆర్ఎల్‌పి నం.249/01/జెఎ, కానూరు గ్రామ పంచాయతీ యొక్క ఆర్.ఎస్.నం.187 లో ఆస్తి బేరింగ్ కొలిచే 150 చ.గ.లు. లేదా 125.42 చ.మీ.లు. హద్దులు : ఉత్తరం: శృంగవరపు ఉమా ప్రవీణ్ ఆస్తి, దక్షిణం: తుమ్మల వంశీకృష్ణ ఆస్తి, తూర్పు: 33 అ.లు. వెడల్పు రోడ్డు, పడమర: సముదాయకపు స్థలం ఆస్తి. ఆస్తి బేరింగ్ ఫ్లాట్ నం.: బి, శేషాద్రి ఎన్‌క్లేవ్ యొక్క ఒకటవ అంతస్తు, కానూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ పటమట సబ్ రిజిస్ట్రార్ క్రింద కొలిచే 18.75 చ.గ.లు. యుడిఎస్ తో ప్లింత్ ఏరియా 579.50 చ.అ.లు. 130 కామన్ ఏరియాతో సెమీ ఫినిష్డ్ స్టేజ్ లో 30 చ.అ.లు. టూ వీలర్ పార్కింగ్ ఏరియా తో సౌలభ్య హక్కులు. సరిహద్దులు : ఉత్తరం: ఓపెన్ టు సై వైపు బాల్కనీ, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: మెట్లు మరియు కామన్ కారిడార్.									
2.	VJWHL19000 030 / L&T	శ్రీ. కనమర్లపూడి చంద్రశేఖర్ ("రుణగ్రహీత") 2) శ్రీమతి. కనమర్లపూడి ధనలక్ష్మి ("సహ రుణగ్రహీత")	ఇఎఆర్‌సి ట్రస్ట్-ఎస్‌సి-396	ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, నారిమన్ పాయింట్, 000405120290 ICIC0000004	Rs. 95,44,889.16/-	Rs. 55,00,000/-	Rs. 5,50,000/-	11.10.2023 AT 11:30 AM	భౌతికం
ఆస్తి వివరణ : గుంటూరు జిల్లా, పిన్-522601, నరసరావుపేట, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట మున్సిపాలిటీ, బరంపేట, హనుమాన్ గుడి వద్ద బేరింగ్ కొత్త డో.నం.1-10-12, పాత డో.నం.1-5-74, టి.ఎస్.నం.54, పాత డో.నం.123/ఎ1, మున్సిపల్ వార్డు నం.1, పాత మూల్యాంకనం నం.136, ప్రస్తుత మూల్యాంకనం నం.1024000187, బరంపేటలోని ఓపెన్ స్థలం యొక్క మొత్తం కొలిచే 168.8487 చ.గ.లు. లేదా 141.1778 చ.మీ.లకు సమానం మరియు హద్దులు : తూర్పు: మున్సిపల్ బజార్, పడమర: మున్సిపల్ బజార్ రోడ్డు, ఉత్తరం: ఎస్. వెంకటేశ్వర్లు ఆస్తి, దక్షిణం: శ్రీ.ఎమ్. శ్రీసుబాష ఆస్తి.									

వేలం ప్రక్రియకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం:

1	అన్ని డిమాండ్ డ్రాఫ్టులు (డిడి) పైన పేర్కొన్న విధంగా ట్రస్ట్ పేరుకు అనుకూలంగా డ్రా చేయబడతాయి మరియు ముంబైలో చెల్లించబడతాయి.	
2	ఇఎమ్‌డి సమర్పణ చివరి తేదీ	వేలం తేదీకి 1 రోజు ముందు స్వీకరించబడింది
3	బిడ్ల సమర్పణ కోసం స్థలం	ఈడల్వీజ్ హౌస్, ముంబై వద్ద
4	వేలం స్థలం (వేలం కోసం వెబ్‌సైట్)	ఇ-వేలం (https://auction.edelweissarc.in)
5	సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబరు	18002666540
6	ఆస్తి తనిఖీ తేదీ మరియు సమయం	ముందస్తు నియామకం ప్రకారం

విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి ఇఎఆర్‌సి వెబ్‌సైటలో అందించిన లింక్‌ను https://auction.edelweissarc.in చూడండి.

ప్రదేశం : విజయవాడ
తేది: 07.09.2023
సం/- అధీకృత అధికారి
ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ తరపున
Edelweiss Asset Reconstruction

మీకోసం

పాలలో మీగడ ఎక్కువగా రావాలంటే కాసే ముందు పాలగిన్నెను చల్లటి నీటిలో ఉంచాలి.

జీవన సౌరభం

చిన్న ప్రోత్సాహం కూడా కొండంత ఉత్సాహాన్ని నింపుతుంది.

ఉత్తమ విద్యార్థి



కొత్తపేట పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో మాధవరావు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్రతి సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చి పాఠశాల స్థాయిలో మొదటి స్థానంలో వచ్చిన విద్యార్థికి ఉత్తమ విద్యార్థి పురస్కారం ఇవ్వడం ఆ స్కూలు ఆనవాయితీ. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో రాజు, రాము, గోపీకి ఒకే మార్కులు వచ్చాయి. ఎవరికి ఉత్తమ విద్యార్థి పురస్కారం ఇవ్వాలో అర్థం కాలేదు. తోటి ఉపాధ్యాయుల సలహాలను తీసుకుందామని సమావేశం ఏర్పాటు చేశారు మాధవరావు. వారం రోజుల పాటు ముగ్గురు విద్యార్థులను ఉదయం ఉద్యానవనంలో మొక్కలకు నీళ్ళు పోయాలి. మధ్యాహ్నం వృద్ధాశ్రమం భోజనం సమయంలో పాల్గొనాలి. సాయంత్రం గ్రంథాలయాన్ని సందర్శించాలి. ఈ మూడు కార్యక్రమాలు ఎవరైతే క్రమం తప్పకుండా చేస్తారో వారిని ఉత్తమ విద్యార్థిగా ఎన్నుకుందామని మాస్టార్లందరూ తీర్మానించారు.

వారం రోజులు గడిచాయి. మళ్లీ ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. 'మనం అనుకున్నట్టుగానే ముగ్గురు విద్యార్థులు మూడు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాము మాత్రమే ఉత్తమ విద్యార్థికి అర్హత సాధించాడు' అని అన్నారు హెచ్‌ఎం. 'ముగ్గురూ హాజరైతే రాము ఒక్కడే ఎలా అర్హత సాధించాడు సార్' కుతూహలంతో అడిగారు మిగిలిన మాస్టార్లు.

"వారికి అప్పజెప్పిన పనులను నేనే స్వయంగా పర్యవేక్షించాను. అప్పుడే ఎవరు మనసుపెట్టి చేశారో తెలిసింది. రాము మాత్రమే మొక్కలకి నీళ్ళు పోయడమే కాక, ఎండిన ఆకులు ఏరుతూ, పాదులు చేస్తూ, ఉద్యానవనాన్ని శుభ్రం చేశాడు. మధ్యాహ్నం వృద్ధాశ్రమంలో కూడా భోజనాలు పెడుతూ, అందరితో ప్రేమగా గడిపాడు. గ్రంథాలయంలో కూడా ఎంతో శ్రద్ధగా కథలు, విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలను చదువుతూ ముఖ్యమైన విషయాలను పుస్తకంలో రాసుకునేవాడు. బట్టీ పట్టి మార్కులు తెచ్చుకోవడం తెలివికీ, విలువలకూ కొలమానం కాదు. పెద్దల పట్ల ప్రేమ, దయ, మొక్కలను పరిరక్షించడం, పర్యావరణంపై బాధ్యత, పుస్తకాలను విజ్ఞానం కోసం ఉపయోగించుకోవాలనే ఉత్సుకత చదువుతో పాటు ప్రతి విద్యార్థికి ఉండాలి. అవి రాములో ఉన్నాయని నేను ప్రత్యక్షంగా చూశాను. ఈ ఏడాది పాఠశాల ఉత్తమ విద్యార్థి రాము అని ప్రకటిస్తున్నాను' అని మాధవరావు చెప్పగానే సహ ఉపాధ్యాయులు అందరూ చప్పట్లు కొట్టారు.

-కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం
9441791239



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న అంకెలను వరుసగా కలిపితే అందమైన కుక్కపిల్ల బొమ్మ వస్తుంది. ట్రై చేయండి మరి.

నేను గీసిన బొమ్మ



కె.భువనేశ్వరి, 7వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల, కంబదహాళ్, పెద్ద కడబూర్ మండలం, కర్నూలు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పుట్టుకతోనే అంధత్వం. కుటుంబానిది కడు పేదరికం. ఎటు నుంచీ అందని సాయం. అయినా ఆమె బెదిరిపోలేదు. ఆత్మ విశ్వాసాన్ని ప్రోదిచేసుకుని క్రీడా దివిటీగా వెలిగింది. చీకట్లను చీల్చుతూ తారకై మెరిసింది. చిన్నతనం నుంచే క్రీడల్లో రాణిస్తూ.. నేడు ప్రపంచ అంధుల క్రికెట్‌లో విజయాల పూలు పూయిస్తోంది. దేశ క్రీడా ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేస్తోంది. ఆమెనే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరి పుత్రిక వలసనైని రవణి. ఆమె క్రీడా ప్రస్థానాన్ని పరికించి చూస్తే ఎన్నో స్ఫూర్తిదాయక విషయాలు కళ్లముందు కదలాడతాయి.

అంధత్వాన్ని గెలిచిన ఆల్‌రౌండర్ రవణి

రవణి స్వస్థలం అల్లూరి జిల్లా హుకుంపేట మండలం మెరకచింత పంచాయతీ రంగసింగపాడు. తల్లిదండ్రులు గోపాలకృష్ణ, చిట్టెమ్మ. ఉన్న కొద్దిపాటి వ్యవసాయమే ఆధారం. వీరికి ఐదుగురు సంతానం కాగా, రవణి, సూరమ్మ, రవికుమార్ అంధులు. ఒక కుటుంబంలో ముగ్గురు అంధులైతే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇన్ని ఇబ్బందుల్లోనూ రవణిని చదివించాలని ఆ కుటుంబం అనుకుంది. ఈ క్రమంలోనే రెండో తరగతి వరకూ రవణి స్వగ్రామంలోనే చదువుకుంది. ఆ తరువాత కొద్ది మంది సలహా మేరకు విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం వారిజ నేత్ర విద్యాలయలో చేరింది. అంతవరకూ గ్రామం దాటి ఎప్పుడూ బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టని రవణి కొత్తలో నేత్ర విద్యాలయ నుంచి పారిపోవడానికి ప్రయత్నించేంది. ఆ తర్వాత అక్కడ ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమె మనసును నెమ్మదిగా మారుస్తూ అక్కడ ఉండేలా అలవాటు చేశారు. అలా ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకున్న రవణి తన వైకల్యాన్ని మర్చిపోయి ఆటల్లో చురుగ్గా పాల్గొనడం ప్రారంభించింది. నేడు ఆమె హైదరాబాద్‌లోని నేత్ర విద్యాలయలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది.

తొలుత అథ్లెట్‌గా రాణింపు

రవణికి అథ్లెటిక్స్ అంటే ప్రాణం. రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో విశేషంగా రాణించింది. 2018–19లో విశాఖ, విజయవాడల్లో జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పై మూడు విభాగాల్లోనూ బంగారు పతకాలు గెలిచింది. డిస్కస్‌త్రోలో ఆమె పాల్గొన్న ప్రతిసారీ పసిడినే ఒడిసి పట్టింది. ఈ క్రమంలోనే 2020లో సహచరులు, నేత్రాలయ సిబ్బంది సూచన మేరకు క్రికెట్‌వైపు దృష్టి మరల్చింది.

క్రికెట్‌లో విశేష ప్రతిభ

రవణికి అంధుల జాతీయ స్థాయి క్రికెట్ క్రీడాకారుడు అజయ్ నుంచి ప్రోత్సాహం లభించింది. సీనియర్ ఆటగాడైన గోపి క్రికెట్‌లో మెళకులను నేర్పించారు. దీంతో తక్కువ సమయంలోనే రవణి క్రికెట్‌లో మెరుపులు మెరిపించింది. అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపికల్లో సెలక్ట్ అయింది. అక్కడి నుంచి ఇక వెనుదిరిగి చూసుకోలేదు. ఒక్కో మ్యాచ్‌లో ప్రతిభ కనబరుస్తూ 2022 నుంచి భారత జాతీయ జట్టుకు ఆడుతోంది. గత ఏడాది బెంగళూరులో జరిగిన మెగస్ ట్రోఫీలోనూ ఆడింది. ఆ తరువాత నేపాల్‌లో జరిగిన క్రికెట్ టోర్నీలోనూ రాణించింది. ప్రతి మ్యాచ్‌లో రెండు, మూడు వికెట్లు తీస్తూ, బ్యాటింగ్‌లో ప్రతిభ కనబరుస్తూ ఆల్ రౌండర్‌గా రాణించింది. గత నెల 18 నుంచి 27 వరకూ ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్ ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో జరిగిన ఇంటర్నేషనల్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ (ఐబిఎస్‌ఎ – 2023) ప్రపంచ క్రీడా పోటీల్లో రవణి భారత మహిళా అంధుల జట్టులో ఆడి విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించింది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లను భారత్ మట్టికరిపించడంలో ఆమెదే కీలకపాత్ర. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 52 పరుగులతో రవణి రాణించి అందరి మెప్పు పొందింది. వెరసి ఈ ఐబిఎస్‌ఎ – 2023 టోర్నీలో ఐదుకు ఐదు మ్యాచ్‌లనూ భారత్ నెగ్గి టైటిల్‌ను కైవశం చేసుకుంది.

పలువురి ప్రశంసలు

ఐబిఎస్‌ఎ వరల్డ్ గేమ్స్‌లో టైటిల్‌ను నెగ్గిన భారత అంధుల క్రికెట్ జట్టును ప్రధాని నరేంద్ర మోడీ అభినందించారు, వారి విజయం పట్ల దేశం గర్వంగా ఉందని కితాబులిచ్చారు. రంగసింగపాడులో ఉంటున్న రవణి తల్లిదండ్రులతో ఆ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడి గెలుపుపై సంతోషం వ్యక్తం చేశారు. రవణి ప్రతిభను కొనియాడారు. ఒక విధంగా చెప్పాలంటే ఆగస్టు చివరి వారంలో రవణి ఇంట సంబరం నెలకొంది. గ్రామస్తులు మిఠాయిలు పంచుకున్నారు. సిపిఎం వైస్ ఎంపిపి సుడిపల్లి కొండలరావు, బాకూరు ఎంపిటిసి నైని సత్తిబాబు, మెరకచింత సర్పంచ్ దూసూరు వెంకటరావు, మెరకచింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణరావు, రాప సర్పంచ్ కొప్పుల లక్ష్మయ్య, మత్స్యపురం సర్పంచ్ పూజారి సుబ్బారావు గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్ సుడిపల్లి లక్ష్మీ ప్రమీల, తదితరులు రవణిని అభినందించారు. ఈ నెల 9న రవణి తన స్వగ్రామానికి వస్తున్న సందర్భంగా ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వంతాడపల్లి చెక్‌గేటు నుంచి పాడేరు – హుకుంపేట వరకూ ర్యాలీ నిర్వహించనున్నారు.

గెలిచినప్పటికీ ప్రోత్సాహం ఏదీ ?

అంతర్జాతీయ స్థాయిలో సాధారణ క్రీడాకారులు గెలిస్తే పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు, నగదు నజరానాలు ప్రకటించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగ క్రీడాకారుల పట్ల మాత్రం ఆ తీరున వ్యవహరించడం లేదు. అంధ మహిళా క్రికెటర్ల విషయంలోనూ అదే జరిగింది. ప్రధాని ప్రశంసలకే పరిమితమయ్యారు. ఇంతటి పేదరికంలోనూ క్రికెట్‌లో విశేషంగా రాణిస్తున్న రవణికి ప్రభుత్వాలు ఏ విధంగానూ సాయం అందించలేదు.

అంధుల క్రికెట్ పూర్తి భిన్నం

క్రికెట్ అంటేనే బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్. మైదానంలో చిరుతల్లా కదలాలి. అలాంటిది అంధులు ఎలా క్రికెట్ ఆడతారనేది ఎక్కువ మందిలో సందేహం. అందుల క్రికెట్ జట్టులో మూడు విభాగాలుగా క్రీడాకారులు ఉంటారు. ప్రతి జట్టులో బి 1 కేటగిరీలో నలుగురు, బి 2లో ముగ్గురు, బి 3లో నలుగురు ఉంటారు. బి 1లో పూర్తిగా చూపు కనిపించని వారే ఉంటారు. బి 2లో 2 – 3 మీటర్లు కనిపించేవారు, బి 3లో 3 – 6 మీటర్లు కనిపించేవారు ఉంటారు. మ్యాచ్‌లో బి 1 వారే కీలకపాత్ర పోషిస్తారు. వీరు చేసే ప్రతి పరుగుకూ మరో పరుగును అదనంగా కలిపి లెక్కిస్తారు. బౌలర్ బంతి వేసేముందు రెడీ అని, చేతి నుంచి బాల్ విడిచాక ప్లే అని కచ్చితంగా అరవాల్సి ఉంటుంది. ఇదే ఈ క్రీడలో అత్యంత కీలకం. బ్యాటింగ్ చేసే వారు బాల్ శబ్దాన్ని బట్టి సమయోచితంగా షాట్ కొట్టాల్సి ఉంటుంది. మహిళా అంధ క్రికెటర్ల జట్టులో రవణి బి1 కేటగిరీలో ఉంది. ఆల్‌రౌండర్‌గా రాణిస్తోంది.

- కోడూరు అప్పలనాయుడు
94915 70765

'ఉస్తాద్' షూటింగ్‌లో పవన్

'ఉస్తాద్ భగత్‌సింగ్'లో పవన్ కల్యాణ్, శ్రీలీల నటిస్తున్నారు. గురువారం నుంచి పవన్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ తాజాగా ఓ సరికొత్త పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందిస్తున్నారు.

పుష్ప-2 లీక్స్

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా పుష్ప–2 షూటింగ్ జరుగుతోంది. షూటింగ్ నుంచి ఓ వీడియో బయటకు వచ్చింది. అందులో వందలాది లారీల్లో ఎర్ర చందనం దుంగలను తరలిస్తూ ఉంటారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. అల్లు అర్జున్ సరసన రష్మిక నటస్తున్న విషయం తెలిసిందే. ఫహద్ ఫాజిల్ విలన్‌గా నటిస్తున్నారు. ఇక, సునీల్, అనసూయ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

పండుగ సినిమాల్లో శ్రీలీల జోరు

వినాయకచవితి, దసరా, దీపావళి వచ్చే పెద్ద హీరోల సినిమాల్లో హీరోయిన్‌గా శ్రీలీలకే అవకాశాలు ఎక్కువగా దక్కాయి. వినాయక చవితి పండగకు స్కంద మూవీ విడుదల అవుతోంది. రామ్ హీరో కాగా, శ్రీలల హీరోయిన్. ఈ సినిమాకు బోయపాటి దర్శకత్వం వహిస్తున్నారు. దసరాకు భగవంత్ కేసరి విడుదల అవుతుంది. ఈ సినిమాలో బాలకృష్ణ హీరో. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీలల కీలకపాత్ర పోషిస్తోంది. కాజల్ హీరోయిన్. దీపావళికి హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా ఆది కేశవ మూవీ విడుదల కానుంది. ఇందులో శ్రీలీలే వైష్ణవ్ తేజ్‌కి జోడీ. క్రిస్మస్ పండగ సమయంలో నితిన్ 'ఎక్స్‌ట్రాడ్నరీ' చిత్రంలో శ్రీలీల నటిస్తోంది. సంక్రాంతి పండగకు రానున్న 'గుంటూరు కారం'లో మహేష్ సరసన కూడా శ్రీలీల నటిస్తోంది.

వియత్నాంలో శిక్షణకు నిఖిల్

హీరో నిఖిల్ తాజాగా 'స్వయంభూ' ప్రాజెక్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో పురాణ యోధునిగా సవాలు చేసే పాత్రను పోషించనున్నాడు. అందుకుగానూ మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీ శిక్షణకు వియత్నాం బయల్దేరాడు. సైగాన్‌లో నెల రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో పాల్గొనబోతున్నాడు. స్టంట్ మాస్టర్లు నిఖిల్‌కి శిక్షణ ఇవ్వనున్నారు. భరత్ కృష్ణమాచారి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చందు మొండేటితో 'కార్తికేయ–3' చిత్రంలో నిఖిల్ నటించనున్నారు.

'కల్కి'లో రామ్ గోపాల్ వర్మ

ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ'కు సంబంధించి ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో రామ్ గోపాల్ వర్మ అతిథి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే 'కల్కి'లో రాజమౌళి ఉన్నారంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు దర్శకులు వారి పాత్రలకు సంబంధించిన షూటింగ్‌ను కూడా పూర్తి చేశారని సమాచారం. బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్, కోలీవుడ్ స్టార్ హీరో కమల్‌హాసన్ ఇందులో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వచ్చే ఏడాది మే నెలలో ఈ సినిమా విడుదల అయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన దీపిక పదుకొణె నటిస్తున్నారు.

'తేరే ఇష్క్ మెన్'లో ధనుష్

కోలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్‌లోనూ నటించిన హీరో ధనుష్. కథానాయకుడిగా 50 చిత్రాల మైలు రాయిని దాటారు. 51 చిత్రానికి చిత్రాన్ని తనే స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ దీనినిన నిర్మిస్తోంది. ఈ చిత్రానికి 'తేరే ఇష్క్ మెన్' అనే పేరును ఖరారుచేశారు. ఏఆర్.రెహ్మాన్ సంగీతం అందించనున్నారు. ఇందులో ధనుష్‌కు జంటగా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీని నటించనున్నట్లుగా సమాచారం. నవంబర్‌లో ప్రారంభించి వచ్చే ఏడాది జూన్ 30 తేదీన విడుదల చేయాలని నిర్ణయించారు.

పసలేని పేస్ బౌలింగ్‌పై

సర్వత్రా విమర్శలు

10న పాకిస్తాన్‌తో సూపర్–4 కీలక పోరు
నెట్స్‌లో చెమటోడ్చుతున్న ఆటగాళ్లు



కొలంబో: ఆసియా కప్ సూపర్–4లో భారత జట్టు 10న పాకిస్తాన్‌తో కీలక పోరుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో భారత పేస్ విభాగంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. లీగ్ దశలో పాకిస్తాన్‌పై తొలిగా బ్యాటింగ్‌కు వచ్చి 266పరుగులకే ఆలౌటైన టీమిండియా.. నేపాల్‌తో జరిగిన కీలకపోరులో భారత పేసర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారని అన్నివైపులనుంచి విమర్శలొస్తున్నాయి. నేపాల్‌పై షమీ(1/29), సిరాజ్(3/61), శార్దూల్(1/26) హార్దిక్(1/34) ధారాళంగా పరుగులు సమర్పించుకొన్నారు. ఈ మ్యాచ్‌కు బుమ్రా దూరంగా ఉన్నా.. షమీ 7 ఓవర్లలో 29పరుగులు ఇస్తే.. సిరాజ్ 9.2 ఓవర్లలో ఏకంగా 61పరుగులు సమర్పించుకొన్నాడు. ఇక శార్దూల్ 4ఓవర్లలో 26, హార్దిక్ 8 ఓవర్లలో 34పరుగులు ఇచ్చారు. వీరంతా కలిసి తీసింది ఒక్కో వికెట్ మాత్రమే. సిరాజ్ 3వికెట్లు తీసినా.. 60కు పైగా పరుగులు సమర్పించుకొన్నాడు. దీంతో ఆదివారం కొలంబో వేదికగా పాకిస్తాన్‌తో జరిగే కీలకపోరుకు ఈ పేస్‌తో విజయం సాధించాలను కోవడం కష్టమేనని విమర్శలొస్తున్నాయి. ఓ పసికూన జట్టు భారత్‌పై 230పరుగులు చేస్తే.. అగ్రశ్రేణి జట్టు టీమిండియా పేసర్ల భరతం పట్టడం ఖాయమని పెదవి విరుస్తున్నారు. ఈ క్రమంలో పాక్‌తో జరిగే సూపర్ 4 మ్యాచ్ విజయంపై కన్నేసిన టీమిండియా.. ప్రధానంగా పేస్ బౌలింగ్‌పైనే దృష్టి సారించింది. గురువారం వర్షం పడడంతో భారత క్రికెటర్లు ఇండోర్ స్టేడియంలోనే ప్రాక్టీస్ చేశారు. కొలంబోలో గురువారం ఉదయం నుంచే వర్షం ప్రారంభమైంది. ఇక తొలి రెండు మ్యాచ్‌లకు దూరమైన కేఎల్ రాహుల్ కూడా బ్యాటింగ్ చేశాడు. అతడితో పాటు విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోలను బిసిసిఐ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్.. బ్యాటింగ్ కోచ్ విక్రం రాథోడ్.. సూర్యకుమార్, శుభ్‌మన్ గిల్‌కు సలహాలిస్తూ కనిపించారు. మరోవైపు పాకిస్తాన్ జట్టు సూపర్–4లో బంగ్లాదేశ్‌పై భారీ విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

అకెర్మన్, మెర్వ్‌లకు పిలుపు..
వన్డే ప్రపంచకప్‌కు నెదర్లాండ్స్ జట్టు ఇదే!

ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించిన నెదర్లాండ్స్ జట్టులో సీనియర్ బ్యాటర్లు అకెర్మన్, వాన్ డెర్ మెర్వ్‌లకు చోటు దక్కింది. నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డు ప్రకటించిన 15మందితో కూడిన జట్టుకు స్కాట్ ఎడ్వర్డ్స్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ ఏడాది జరిగిన ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో వీరిద్దరూ ఆడలేదు. ఇక తెలుగు రాష్ట్రానికి చెందిన తేజ నిడమనూరుకు నెదర్లాండ్స్ ప్రపంచకప్ జట్టులో చోటుదక్కింది. ఆల్‌రౌండర్ అయిన తేజ.. విజయవాడలో పుట్టి నెదర్లాండ్స్ జాతీయ జట్టుకు 2022 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. జింబాబ్వేలో జరిగిన క్వాలిఫయర్స్‌లో నెదర్లాండ్స్ సత్తాచాటింది. సూపర్ సిక్స్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై భారీ విజయం సాధించి చివరి బెర్తును సొంతం చేసుకుంది. నెదర్లాండ్స్ ప్రపంచకప్ ఆడటం ఇది ఐదోసారి. న్యూజిలాండ్ జట్టు చివరిసారిగా భారత్ వేదికగా జరిగిన 2011 వన్డే ప్రపంచకప్‌లో ఆడింది. ఈ ఏడాది ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్ తన తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ హైదరాబాద్ వేదికగా (అక్టోబర్ 6న) జరగనుంది.

జట్టు: ఎడ్వర్డ్స్(కెప్టెన్), ఓ'డౌడ్, డి లీడే, విక్రమ్ సింగ్, తేజ నిడమనూరు, పాల్ వాన్, అకెర్మాన్, వాన్ డెర్ మెర్వే, వాన్ బీక్, ఆర్యన్ దత్, ర్యాన్ క్లైన్, వెస్లీ బరేసి, జుల్ఫికర్, షరీజ్ అహ్మద్, సిబ్రాండ్ ఎంగెల్‌బ్రెట్.

సెమీస్‌కు అల్కరాజ్, మెద్వదేవ్

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి టాప్‌సీడ్, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్, 3వ సీడ్, రష్యాకు చెందిన డానియేల్ మెద్వదేవ్ ప్రవేశించారు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో అల్కరాజ్.. 6–3, 6–2, 6–4 తేడాతో 12వ సీడ్, జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరేవ్‌ను వరుససెట్లలో చిత్తుచేశాడు. ఈ మ్యాచ్ సుమారు 2 గంటల 30 నిమిషాలపాటు సాగింది. ఈ మ్యాచ్‌లో భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ సందడి చేశాడు. అతని స్నేహితులతో కలిసి స్టేడియానికి వెళ్లి ప్రత్యక్షంగా వీక్షించాడు. ఆట మధ్యలో అల్కరాజ్ కాసేపు విశ్రాంతి తీసుకుని డ్రింక్స్ తాగుతుండగా అతడి వెనుకవైపు ప్రేక్షకుల సీట్లలో కూర్చుని ఉన్న ధోనీ తన ఫ్రెండ్స్‌తో ముచ్చటిస్తూ కనిపించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. మరో క్వార్టర్‌ఫైనల్లో మెద్వదేవ్ 6–4, 6–3, 6–4తో 8వ సీడ్, రష్యాకే చెందిన రుబ్లేవ్‌ను ఓడించాడు.



అల్కరాజ్-జ్వెరేవ్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న భారతజట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ.

ఛెత్రీ సేనకు నిరాశ..

కింగ్స్ కప్స్ సెమీస్‌లో ఇరాక్ చేతిలో ఓటమి

చింగ్‌మై (థాయ్‌లాండ్): కింగ్స్‌కప్–2023 సెమీస్‌లో ఛెత్రీ సేనకు నిరాశ తప్పలేదు. ఈ ఏడాది హ్యాట్రిక్ ట్రోఫీలతో జోరుమీదున్న భారత ఫుట్‌బాల్ జట్టు గురువారం జరిగిన కింగ్స్ కప్ సెమీస్‌లో పెనాల్టీ షూటౌట్‌లో ఇరాక్ చేతిలో ఓటమిపాలైంది. థాయ్‌లాండ్ స్టేడియం 700వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈ పోటీలు జరుగుతున్నాయి. నిర్ణీత సమయం పూర్తయ్యే సరికి ఇరుజట్లు 2–2గోల్స్‌తో సమంగా నిలిచాయి. అనంతరం పెనాల్టీ షూటౌట్‌లో 5–4గోల్స్ తేడాతో ఇరాక్ చేతిలో ఓడింది. పెనాల్టీ తొలి గోల్‌ను చేయడంలో భారత స్ట్రయికర్ బ్రాండన్ విఫలమయ్యాడు. ఇరాక్ ఐదు గోల్స్ చేయగా.. భారత్ నాలుగు గోల్స్ మాత్రమే చేసింది. ఇరాక్ ఆటగాడు జిందాన్ ఇక్బాల్‌ఆట కీలక దశలో రెడ్ కార్డ్‌కు గురై మైదానం వీడాడు. దాంతో ఆ జట్టు పది మంది ఆటగాళ్లతోనే మిగతా మ్యాచ్‌ను పూర్తిచేసింది. ఇటీవల జరిగిన ముక్కోణపు టోర్నీ, ఇంటర్ కాంటినెంటల్ కప్, శాఫ్ చాంపియన్‌షిప్స్‌లో విజేతగా నిలిచింది. కెప్టెన్ సునీల్ ఛెత్రీ అద్భుత ప్రదర్శనకు తోడూ యువ ఆటగాళ్లు రాణించడంతో ఈ ఏడాది భారత జట్టు వరుస విజయాలు సాధించింది. అంతేకాదు ఫిఫా ర్యాంకింగ్స్‌లో 100లోపు నిలిచింది. రెండో సెమీస్ లెబనాన్–థాయ్‌లాండ్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68